బోనస్ ఎగ్గొట్టేందుకే జాప్యం : ప్రశాంత్‌రెడ్డి

నిజామాబాద్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: రైతులకు ఇవ్వాల్సిన బోనస్ రూ.500 ఎగ్గొట్టేందుకే కొనుగోళ్లు జాప్యం చేస్తున్నారని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్‌తో కలిసి కలెక్టరేట్ ఆవరణలో గురువారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ప్రైవేటు వ్యక్తులు కొనుగోలు చేసిన ధాన్యానికి బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాల ప్రారంభించడం ఆలస్యమవుతుండటం వల్లే రైతులు ప్రైవేటును ఆశ్రయించాల్సి వస్తోందన్నారు.

న్యాక్ గుర్తింపునకు సిద్ధం కావాలి

తెవివి క్యాంపస్, న్యూస్‌టుడే: న్యాక్ గుర్తింపు కోసం సిద్ధం కావాలని తెవివి వీసీ ఆచార్య టి. యాదగిరిరావు సూచించారు. వర్సిటీ పరిపాలన భవనంలో గురువారం విభాగాధిపతులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. న్యాక్ గుర్తింపుతో వర్సిటీకి భవన నిర్మాణ గ్రాంట్లు, మౌలిక వసతుల కల్పనకు అవసరమైన ఆర్థిక మద్దతు లభిస్తుందన్నారు. బోధన సిబ్బంది, పరిశోధకులకు అవసరమైన ప్రాజెక్టుల నిర్వహణ, ల్యాబ్‌ల ఏర్పాట్లకు విద్యార్థుల ఫెలోషిప్స్ అనివార్యమనే విషయాన్ని అందరూ గుర్తించాలన్నారు. బోధన, బోధనేతర ఉద్యోగులు, సిబ్బంది తమ శక్తి వంచన లేకుండా వర్సిటీ అభివృద్ధికి కృషి చేయాలని రిజిస్ట్రార్ యాదగిరి పేర్కొన్నారు. అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ఆచార్య చంద్రశేఖర్, సీవోఈ ఆచార్య అరుణ, ఐక్యూఏసీ డైరెక్టర్ నాగరాజు, వైస్ ప్రిన్సిపల్ సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.



విభాగాధిపతుల సమావేశంలో వీసీ ఆచార్య యాదగిరిరావు, రిజిస్ట్రార్ యాదగిరి తదితరులు

నీటి విడుదల

నిజాంసాగర్, న్యూస్‌టుడే: నిజాంసాగర్‌లోకి ఎగువ నుంచి 12,150 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండటంతో మూడు గేట్లు ఎత్తి అంతే నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు నీటిపారుదలశాఖ ఏఈఈ శివప్రసాద్ గురువారం తెలిపారు. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 1405 అడుగులు (17.802 టీఎంసీలు) కాగా ప్రస్తుతం 1404.90 అడుగుల (17.687 టీఎంసీలు) నిల్వ ఉందని చెప్పారు.

రైతులకు అండగా ఉంటాం

ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

నిజామాబాద్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఉత్తర తెలంగాణ విద్యుత్తు పంపిణీ సంస్థ వార్షిక టారిఫ్ ప్రతిపాదనలపై విద్యుత్తు నియంత్రణ మండలి(ఈఆర్‌సీ) నిజామాబాద్ కలెక్టరేట్‌లో గురువారం బహిరంగ విచారణ నిర్వహించింది. కార్యక్రమానికి ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ఆయా వర్గాల ప్రతినిధుల ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. కొందరు రైతుల విషయమై ప్రస్తావించగా వివరణ ఇచ్చారు. అన్నదాతల సమస్యలు పరిష్కరించేందుకు విద్యుత్తు అధికారులు పొలంబాట నిర్వహిస్తున్నారని చెప్పారు. వదులు తీగలు, వంగిన స్తంభాలు అప్పటికప్పుడు సరిచేస్తున్నారని తెలిపారు. తమ శాఖాపరంగా సమస్యలు తలెత్తితే 1912 నంబరుకు ఫోన్ చేయాలని సూచించారు.



సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, వ్యాపారులు, ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి, అధికారులు

ప్రజలపై భారం వేయొద్దు

విద్యుత్తు ఛార్జీలు పెంచి ప్రజలపై భారం మోపడం సరికాదని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్‌తో హాజరై మాట్లాడారు. కొన్నాళ్లుగా విద్యుత్తు వినియోగం పెరిగిందని, ముఖ్యంగా వేసవిలో ప్రతి ఇంట్లో 300 యూనిట్ల వినియోగం సర్వసాధారణమన్నారు. ఛార్జీలు పెంచితే మధ్య తరగతి ప్రజలపై రూ.వేలల్లో భారం పడుతుందన్నారు. పరిశ్రమలకు సంబంధించి డిస్కంలు చేసిన ప్రతిపాదనలు ఆశ్చర్యంగా ఉన్నాయని విమర్శించారు. అన్ని పరిశ్రమలకు ఒకే ధర కట్టాలని చూడటం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. ప్రభుత్వం ఇచ్చే విద్యుత్తు రాయితీ బందయ్యే పరిస్థితి ఉందన్నారు. విచారణకు పలువురు వ్యాపారులు హాజరై ఛార్జీల పెంపు సరి కాదని సూచించారు.



వరికి జై

5.18 లక్షల ఎకరాల్లో పంటల సాగు ● విత్తనాలు, ఎరువులు సిద్ధం చేసిన వ్యవసాయశాఖ

న్యూస్‌టుడే, నిజామాబాద్ వ్యవసాయం

జిల్లాలో యాసంగిలో ఏయే పంటలేస్తారో వ్యవసాయశాఖ ప్రణాళికలు సిద్ధం చేసింది. అవసరమైన ఎరువులు, విత్తనాలు సమకూర్చేందుకు సన్నాహాలు చేస్తోంది. ప్రస్తుతం వానాకాలం ఉత్పత్తులు మార్కెట్‌కు తరలుతున్నాయి. రైతులు రెండో పంటకు సమాయత్తమవుతున్నారు. చివరి రెండు నెలలు భారీ వర్షాలు కురియడంతో చెరువులు నిండుకుండల్లా మారాయి. శ్రీరామసాగర్, నిజాంసాగర్ జలాశయాలు తొణికిసలాడుతున్నాయి. భూగర్భ జలాలు ఆశించిన స్థాయిలో ఉండడంతో అన్నదాతలు వరి సాగుకే జై కొడుతున్నారు. అందుకు తగ్గట్లు సర్కారు పరిమితులు లేకుండా పంటలు వేసుకునేందుకు పచ్చజెండా ఊపింది.

సజ్జ, మొక్కజొన్న పెరగొచ్చు

జిల్లా సాగు విస్తీర్ణం 5.18 లక్షల ఎకరాలు ఉంటే అందులో వరే 4.19 లక్షలు ఉంటుందని అంచనా వేస్తున్నారు. మిగతా లక్ష ఎకరాల్లో మొక్కజొన్న, విత్తన జొన్న, సజ్జ, సెనగ, నువ్వు సాగు చేస్తారని వ్యవసాయశాఖ పేర్కొంది. గత సీజన్ కంటే మొక్కజొన్న, సజ్జ సాగు విస్తీర్ణం పెరగొచ్చని చెబుతున్నారు. పొద్దుతిరుగుడు, నువ్వులు, కుసుమ సాగు తగ్గే అవకాశం ఉంది. పప్పుదినుసుల సాగు అంతంతే ఉంటుందని భావిస్తున్నారు. విత్తనోత్పత్తికి పండించే ఎర్రజొన్న, తెల్లజొన్న, సజ్జ సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. వీటికి బహిరంగ మార్కెట్ కంటే అధిక ధరలు ఉండటంతో సాగుకు సై అంటున్నారు.

ఎవరి నుంచి ఎలా సేకరించాలి..

పెరిగిన సాగు విస్తీర్ణానికి సరిపడా విత్తనాలు ప్రభుత్వరంగ సంస్థలతో పాటు ప్రైవేటు హైబ్రిడ్ కంపెనీలు సమకూరుస్తున్నాయి. వరికి 1,04,942 క్వింటాళ్ల విత్తనం, మొక్కజొన్నకు 1834.88, సెనగ 4019, మినుములు 49.52, సజ్జ 412, నువ్వులు 164, పొద్దుతిరుగుడు 55.8, కుసుమలు 15.12, విత్తన జొన్నకు 832.95 క్వింటాళ్ల విత్తనం అవసరమని వ్యవసాయశాఖ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఎవరి నుంచి ఎలా సేకరించాలో యంత్రాంగం సమీక్షిస్తోంది.

జిల్లాలో ప్రధాన పంటల సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)

పంట	సాధారణ సాగు	గతేడాది	సాగు అంచనా
వరి	3,21,291	4,15,861	4,19,768
మొక్కజొన్న	17,980	21,459	22,936
సెనగ	25,825	16,769	16,076
విత్తన జొన్న	38,000	34,086	33,318
నువ్వులు	12,845	6,451	8,240
పొద్దుతిరుగుడు	7,767	3,087	2,790


జిల్లా సాధారణ సాగు: 4,76,748 ఎకరాలు

యాసంగి సాగు అంచనా: 5,18,303 ఎకరాలు

రసీదు తప్పనిసరి

దుకాణాల్లో ఎరువులు, విత్తనాలు కొంటే తప్పనిసరిగా రసీదులు పొందాలి. విత్తనోత్పత్తి పండించే వారు ముందుగానే ఒప్పంద పత్రాలు రాసుకోవాలి. నేలకు అనువైన పంటలే వేయాలి. బహిరంగ మార్కెట్‌లో డిమాండ్ ఉన్న వాటిని సాగుచేయాలి. నీరు సమృద్ధిగా ఉన్న చోటే వరికి మొగ్గు చూపాలి. అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచుతాం.

- వాజీద్‌హుస్సేన్, జిల్లా వ్యవసాయాధికారి





ఏడో బెటాలియన్ ఎదుట బైఠాయించిన పోలీసు కుటుంబాల మహిళలను సముదాయిస్తున్న పోలీసులు

ఒకే పోలీసు వ్యవస్థ ఏర్పాటుకు డిమాండ్

- ఏడో బెటాలియన్ ఎదుట పోలీసు కుటుంబ సభ్యుల రాస్తారోకో
- భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సంఘీభావం

డిచ్‌పల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: ఒకే రాష్ట్రం - ఒకే పోలీస్ వ్యవస్థ ఏర్పాటు చేసి న్యాయం చేయాలని డిచ్‌పల్లిలోని టీజీఎస్‌పీ(తెలంగాణ ప్రత్యేక పోలీస్) ఏడో బెటాలియన్‌లో పనిచేస్తున్న పోలీసు ఉద్యోగుల కుటుంబ సభ్యులు గురువారం 44వ నంబరు జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. మొదట కొద్దిమందితో ఆందోళన ప్రారంభం కాగా.. కొద్దిసేపటికే భారీ సంఖ్యలో తరలివచ్చి ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా పోలీసు ఉద్యోగుల కుటుంబ సభ్యులు మాట్లాడుతూ... గతంలో పోలీసు ఉద్యోగమంటే ఎంతో గౌరవం ఉండేదని.. ప్రస్తుతం గడ్డి తీయిస్తూ రాళ్లు ఎత్తిస్తున్నారని వాపోయారు. ఎనిమిది గంటలకు పైగా పని చేయిస్తుండటంతో అనేక మంది అనారోగ్యం బారిన పడుతున్నారని వీటికి స్వస్తి చెప్పాలని కోరారు. ఉన్నతాధికారుల ఆదేశాల పేరుతో చిన్న ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. మూడు నెలలకు ఒకసారి పోస్టింగ్ మార్చడంతో పిల్లల చదువుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. తమ న్యాయపరమైన సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో ఓ మహిళపై సిబ్బంది ఒకరు చేయిచేసుకోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. రాస్తారోకోతో జాతీయ రహదారిపై రాకపోకలు నిలిచిపోయాయి. ఏసీపీ బస్వారెడ్డి అక్కడికి చేరుకొని పరిస్థితిని అదుపుచేశారు. హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్ జిల్లా పర్యటనకు వెళ్తున్న మాజీ మంత్రి కేటీఆర్ విషయం తెలుసుకొని వారి వద్దకు వచ్చి సంఘీభావం తెలిపారు. వెంట ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, బాల్క సుమన్, సురేందర్, నాయకులు వీజీ గౌడ్, జగన్ ఉన్నారు.

ఒత్తిడి వస్తున్నా.. ముందుకు సాగలేక

ఈనాడు, నిజామాబాద్

ధాన్యం సేకరణలో మిల్లర్ల అంశంపై 26 మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం వెలువడనుంది. అప్పటి వరకు వేచిచూడకుండా రైతుల నుంచి ముందస్తు కొనుగోళ్లు చేయించాలని ఉన్నతస్థాయిలో చేసిన ఆలోచన ముందుకు పడటం పడటం లేదు. తూకాలు వేయించి ప్రభుత్వ గోదాముల్లో నిల్వ చేయాలనే మౌఖిక ఆదేశాలున్నాయి. కానీ, ఇలా చేయటం వల్ల రెండు రకాల ఇబ్బందులు తలెత్తుతాయనే అభిప్రాయం అధికారులు వ్యక్తం చేస్తున్నారు.

పాత విధానంలో అయితే కాంటా వేయగానే బస్తాలు లారీల్లో తరలించి మిల్లుల వద్ద దించుతారు. లోడింగ్ ఛార్జీలు కేంద్రాల నిర్వాహకులు, దించేచోట మిల్లర్లు హమాలీ ఖర్చులు భరిస్తారు. కానీ, ముందస్తు కొనుగోలు చేసి తిరిగి వాటిని మిల్లులకు తరలించాల్సి వస్తే హమాలీ, రవాణా ఖర్చులు రెండుసార్లు భరించాల్సి వస్తుంది. వీటిని ఏ లెక్కలో చూపించాలో స్పష్టత లేదు. రెండోది ధాన్యం నిల్వ సందర్భంలో రోజులు గడిచే కొద్దీ తేమశాతం మరింత తగ్గి బరువులో తేడా వస్తుంది. మిల్లులకు తీసుకెళ్లాక తూకం తగ్గితే మిల్లర్లు అంగీకరించని పరిస్థితులు తలెత్తుతాయని చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే కాంటాలు ప్రారంభించటానికి ఆలోచన చేయాల్సి వస్తోందని ఓ కీలక అధికారి 'ఈనాడు'తో చెప్పారు.

కొనుగోళ్లపై అధికారుల తర్జనభర్జన



జన్నేపల్లి - నవీపేట రోడ్డులో ఆరబోసిన ధాన్యం

అధికారులపై ఒత్తిడి చేస్తున్నా..

ధాన్యం సేకరణకు ఇరు జిల్లాల్లో కలిపి 1060 కొనుగోలు కేంద్రాలు ప్రతిపాదించారు. ఇరు ప్రాంతాల్లో వరి కోతలు ఊపందుకుంటున్న తరుణంలోనే ఇప్పటికే 250 వరకు కేంద్రాలు తెరిచారు. కానీ, తూకాలు ప్రారంభించలేదు. పంట కోసిన రైతులు ధాన్యం కేంద్రాల వద్దకు తెచ్చి ఆరబోస్తున్నారు. కొనుగోలు చేయాలని సహకార సొసైటీల సిబ్బందిని అడుగుతున్నారు. మరోవైపు క్షేత్రస్థాయి పరిస్థితులను గమనించి జిల్లా ప్రజాప్రతినిధులు అధికారులపై ఇదే విషయంలో ఒత్తిడి చేస్తున్నారు. బుధవారం పౌరసరఫరాలశాఖ మంత్రి వద్దకు వెళ్లి ఇదే అంశంపై మాట్లాడిన విషయం తెలిసిందే. అందుకే ముందస్తు కొనుగోళ్లు జరపాలని అధికారులకు వారు సూచించారు. గురువారం మంత్రి స్వయంగా ఇరు జిల్లాల కలెక్టర్లతో ఇదే విషయంపై మాట్లాడినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే వారు జిల్లా యంత్రాంగంతో మరోమారు పరిస్థితిపై సమీక్షించారు. కానీ, గతంలో మిల్లర్లతో ఒప్పందాలు లేకుండా ముందస్తు కొనుగోళ్లు జరిపిన సందర్భంలో మంచిర్యాల ప్రాంతంలో సమస్య ఉత్పన్నమైన విషయం చర్చకు వచ్చింది. అప్పట్లో అధికారులు భద్రపరిచిన ధాన్యం నాణ్యతపై మిల్లర్లు అభ్యంతరాలు తెలిపి తీసుకోలేదు. గురువారం సైతం ఎటూ తేల్చుకోలేక కాంటాలు వేయకుండా వేచిచూద్దామనే ఆలోచన వైపే ఆసక్తి చూపారు.

విధుల్లోకి ఏఈవోలు

న్యూస్‌టుడే, నిజామాబాద్ వ్యవసాయం

నెల రోజులుగా డిజిటల్ సర్వేకు దూరంగా ఉన్న వ్యవసాయ విస్తరణాధికారులు విధుల్లో చేరారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో పంటల సర్వే చేపట్టనున్నారు. ఇప్పటికే సగానికి పైగా పంట కోతలు పూర్తయ్యాయి. వీరు సర్వే చేసేలోగా నూర్పిడి పూర్తికానుంది. మరోవైపు ధాన్యం కొనుగోళ్లలో సన్నరకాలను ధ్రువీకరించే బాధ్యత ఏఈవోలదేనని వ్యవసాయశాఖ స్పష్టం చేసింది. ఇప్పటికే ఆలస్యమైన తూకాలు ముమ్మరం చేయాలని కేంద్రాల నిర్వాహకులు పట్టుబడుతున్నారు. ఇతర రాష్ట్రాల ధాన్యం రాకుండా సరిహద్దు తనిఖీ కేంద్రాల్లో వీరే ఉండాలని అధికారులు భావిస్తున్నారు. కొనుగోళ్లు పూర్తయ్యే లోగా యాసంగి సీజన్ సాగు మొదలుకానుంది. రెండో పంట సర్వేకే సమాయత్తమయ్యే పరిస్థితి కనిపిస్తోంది.

నగరాభివృద్ధికి నిధులివ్వండి

నిజామాబాద్ నగరం, న్యూస్‌టుడే: నగరాభివృద్ధికి అవసరమైన నిధులు ఇవ్వాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ కోరారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి జూపల్లి కృష్ణారావును కలిసి వినతిపత్రం ఇచ్చారు. అభివృద్ధి పనులకు రూ.90 కోట్లు అవసరమన్నారు. టీయూఎఫ్‌ఐడీసీ (తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) నిధులు రూ.60 కోట్లు రావాల్సి ఉందని, దీంతో పనులు మధ్యలోనే ఆగిపోయాయని మంత్రికి వివరించారు. సీడీపీ నిధులూ మంజూరు చేయాలన్నారు. నగరపాలక సంస్థ నుంచి డివిజన్‌కు రూ.10 లక్షలు ఇవ్వాలన్నారు.



జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి జూపల్లికి వినతి పత్రం ఇస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్

మాధవనగర్ రైల్వేగేటు మూసివేత

నిజామాబాద్ - హైదరాబాద్ ప్రధాన రహదారిలోని మాధవనగర్ రైల్వేగేటును గురువారం అర్ధరాత్రి మూసివేశారు. మరమ్మతుల అనంతరం తిరిగి 27వ తేదీ అర్ధరాత్రి తెరుచుకోనుంది. ఈ మార్గంలో రాకపోకలు సాగించేవారు కంఠేశ్వర్ బైపాస్ మీదుగా వెళ్లాలని అధికారులు సూచిస్తున్నారు. మరమ్మతుల్లో భాగంగా గేటు వద్ద రైలు పట్టాలను మార్చనున్నారు. పట్టాలకు ఇరువైపులా గుంతలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, వాటిని పూడ్చివేసి తారు రోడ్డు వేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, డిచ్‌పల్లి గ్రామీణం**



పరిహారం.. పరిహాసం

పది నెలల్లో విద్యుత్తు ప్రమాదంలో 17 మంది మృతి ☛ ఆర్థిక సాయం అందింది ముగ్గురికే

న్యూస్‌టుడే, నిజామాబాద్ అర్బన్

జిల్లాలో ప్రధాన జీవనాధారం వ్యవసాయం. ఉదయం లేవగానే రైతులు పొలంబాట పడతారు. జిల్లావ్యాప్తంగా 5 లక్షల విద్యుత్తు కనెక్షన్లు ఉన్నాయి. వ్యవసాయ బోర్లు, బావుల వద్ద ఫ్యూజులు పడిపోవడం, తీగలు తెగిపడటం, అటవీ జంతువుల నుంచి రక్షణ కోసం కంచెలు వేసి విద్యుత్తు సరఫరా ఇవ్వడం, సొంతంగా తీగలు సరిచేసుకునే క్రమంలో విద్యుదాఘాతంతో ప్రాణాలు కోల్పోతున్నారు.

> విద్యుదాఘాతంతో మృతిచెందిన రైతులు, ఇతరులకు ప్రభుత్వం ఆర్థికంగా అండగా నిలుస్తున్నట్లు చెబుతున్నా వాస్తవ పరిస్థితులు భిన్నంగా ఉంటున్నాయి. జిల్లా వ్యాప్తంగా పది నెలల కాలంలో 17 మంది మృతి చెందగా కేవలం ముగ్గురికి మాత్రమే పరిహారం అందింది. మిగతా వారు ఆర్థిక సాయం కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు.



రావాల్సింది రూ.16.20 లక్షలు

ఈ ఏడాది జనవరి నుంచి 17 మంది కరెంటు షాక్‌తో మృతి చెందితే ముగ్గురు బాధిత కుటుంబాలకు పరిహారం అందింది. 45 పశువులు మృత్యువాత పడితే ఎనిమిది మంది బాధితులకు సాయం అందిందింది. బాధిత కుటుంబాలకు రూ.15 లక్షలు, పశు బాధిత కుటుంబాలకు రూ.1.20 లక్షలు రావాల్సి ఉంది. మనుషులు చనిపోయినవి 14, పశువులు మృత్యువాత పడిన 37 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

దరఖాస్తు ఇలా..

మనిషి విద్యుదాఘాతంతో మరణిస్తే రూ.5 లక్షలు, పశువులకు రూ.40 వేలు, గొర్రెలు, మేకలకు రూ.7 వేల చొప్పున పరిహారం అందిస్తారు. ఎఫ్ఐఆర్ కాపీ, పంచనామా, పోస్టుమార్టం నివేదిక, ఆధార్, చిరునామా తదితర వివరాలతో మండల ఏఈల వద్ద దరఖాస్తు చేసుకోవాలి. అక్కడి నుంచి డీఈలకు, ఎస్ఈ కార్యాలయానికి, ఆ తర్వాత ప్రభుత్వానికి నివేదిస్తే మంజూరు లభిస్తుంది.

ప్రభుత్వానికి నివేదించాం

- రవీందర్, ఎస్ఈ, ఎన్పీడీసీఎల్

విద్యుత్తు ప్రమాదాల్లో మృతి చెందిన వారికి పరిహారం చెల్లిస్తున్నాం. పెండింగ్ దరఖాస్తులను ప్రభుత్వానికి నివేదించాం. త్వరలోనే నిధులు మంజూరవుతాయి. ఎవరూ ఆందోళన చెందొద్దు. రైతులు తమ పొలాల వద్ద ఎవరూ సొంతంగా తీగలు సరి చేసుకోవద్దు. మా సిబ్బందికి చెబితే వచ్చి సరిచేస్తారు.

డిఫాల్టర్ మిల్లులు 39

న్యూస్‌టుడే, నిజామాబాద్ కలెక్టరేట్

ప్రభుత్వం నుంచి ధాన్యం తీసుకొని సకాలంలో సీఎంఆర్(కస్టమ్ మిల్లింగ్ రైస్) ఇవ్వని మిల్లర్లపై అధికారులు చర్యలకు సిద్ధమవుతున్నారు. పలుమార్లు గడువు పొడిగించినా మిల్లర్ల వైఖరిలో మార్పు రాలేదు. జిల్లావ్యాప్తంగా సీఎంఆర్ ఇవ్వని డిఫాల్టర్ మిల్లులు 39 ఉన్నట్లు గుర్తించారు. వారికి పలుమార్లు హెచ్చరిక నోటీసులు జారీ చేశారు. ఇందులో నాలుగు మిల్లులు సీఎంఆర్ ఇస్తుండగా 35 నుంచి స్పందన లేదు. ధాన్యం మరఆడించి బియ్యం ఇవ్వాలని చెప్పినా పెడచెవిన పెడుతున్నారు. కేటాయించిన ధాన్యం మాయం చేసినట్లు తేలడంతో 14 మిల్లులపై క్రిమినల్ కేసు నమోదు చేశారు. వాటికి కేటాయించిన ధాన్యమెంతో లెక్కలు తీస్తున్నారు. వీరిపై ఆర్ఆర్(రెవెన్యూ రికవరీ) చట్టం ప్రయోగించేందుకు సిద్ధమవుతున్నారు.

ఈ సారి ఇవ్వొద్దని నిర్ణయం

డిఫాల్టర్లుగా ఉన్న మిల్లులకు నిబంధన మేరకు ధాన్యం కేటాయించొద్దు. కానీ, గతంలో వీరికి కేటాయించడంతో ఇద్దరు అధికారులు సస్పెన్షన్‌కు గురయ్యారు. ఈ సారి ఇలాంటి తప్పులు జరగొద్దనే ఉద్దేశంతో అధికారులు ప్రణాళిక ప్రకారం ముందుకెళ్తున్నారు. సీఎంఆర్ ఇవ్వకుండా ఎగ్గొట్టిన 35 మిల్లులకు ఈ సీజన్‌లో ధాన్యం ఇవ్వొద్దనే నిర్ణయానికి వచ్చారు. సీఎంఆర్ ఇవ్వకుండా మొండిగా వ్యవహరించే మిల్లులపై చర్యలు ఉంటాయని పౌర సరఫరాల కార్పొరేషన్ జిల్లా మేనేజర్ రమేశ్ తెలిపారు.

కేటాయించిన ధాన్యమెంతో లెక్కింపు



బాయిల్డ్ రైస్ మిల్లులు: 60

రా రైస్ మిల్లులు: 207

సమస్యలు తొలగేలా.. పనులు సాగేలా

● మంచిప్ప-కొండెం రిజర్వాయర్ సామర్థ్యం నిర్ధారణపై సర్వే

ఈనాడు, కామారెడ్డి

గోదావరి జలాల తరలింపు నిమిత్తం చేపట్టిన ప్యాకేజీ-21,22 పనులను పూర్తిచేసేందుకు నీటిపారుదల శాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. పనులకు అడ్డంకిగా మారిన మంచిప్ప-కొండెం రిజర్వాయర్ సామర్థ్యం నిర్ధారణకు సర్వే నిర్వహిస్తున్నారు. రిజర్వాయర్ సామర్థ్యం 3.5 టీఎంసీలకు పెంచాలని భారాస ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. దీంతో సమీపంలోని తండాలు, సాగు భూములు ముంపునకు గురయ్యే అవకాశం ఏర్పడడంతో స్థానికులు భూ సేకరణకు అడ్డంకులు సృష్టించారు. దీంతో జలాల తరలింపు కొలిక్కిరావడం లేదు.

ప్రాజెక్టు స్థితిగతులపై సమీక్ష

● కాళేశ్వరం ప్యాకేజీ-22 పనుల పూర్తితో ఎల్లారెడ్డి, కామారెడ్డి నియోజకవర్గాలతో పాటు మెదక్ జిల్లాలో రెండు లక్షల ఎకరాల భూములు సస్యశ్యామలం కానున్నాయి. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు నెలరోజుల కిందట నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి సమక్షంలో నీటిపారుదల శాఖ అధికారులతో ప్యాకేజీ-22 పనుల స్థితిగతులపై సమీక్ష నిర్వహించారు. నిర్మాణంలో ఉన్న భూంపల్లి రిజర్వాయర్‌తో పాటు మోతె, కాటెవాడి, తిమ్మక్‌పల్లి రిజర్వాయర్‌ల నిర్మాణానికి నీటిపారుదల శాఖ అధికారులు సిద్ధం చేసిన ప్రతిపాదనలను ప్రభుత్వానికి నివేదించారు. ఇదే సమయంలో మంచిప్ప రిజర్వాయర్ నీటి నిల్వ సామర్థ్యం తగ్గిస్తేనే సమస్యకు పరిష్కారం లభించి అమ్రబాద్ వద్ద సొరంగం తవ్వకానికి మార్గం సుగమం అవుతుందని నీటిపారుదల శాఖ అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు.




ఈఎన్సీ అనిల్‌కుమార్ నిర్వహించిన సమీక్షకు హాజరైన ఎల్లారెడ్డి, నిజామాబాద్ గ్రామీణ ఎమ్మెల్యేలు మదన్‌మోహన్‌రావు, భూపతిరెడ్డి

● వారం రోజుల కిందట నీటిపారుదల శాఖ ఈఎన్సీ అనిల్‌కుమార్ సమక్షంలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు నిజామాబాద్ గ్రామీణ ఎమ్మెల్యే భూపతిరెడ్డితో కలిసి నిజామాబాద్, కామారెడ్డి సీఈలు, ప్యాకేజీ-22 పనులను పర్యవేక్షించే ఇంజినీరింగ్ అధికారులతో క్షేత్రస్థాయి పరిస్థితులను సమీక్షించారు. మంచిప్ప రిజర్వాయర్ సామర్థం నిర్ధారణకు రీసర్వే నిర్వహించాలని నిర్ణయించారు. ప్రక్రియ సాగుతోంది.

సమగ్ర నివేదిక సమర్పించాం

- శ్రీనివాస్, సీఈ, నీటిపారుదల శాఖ, కామారెడ్డి

ప్యాకేజీ-22 పనుల పూర్తికి నీటిపారుదల శాఖ ఈఎన్సీ ఆధ్వర్యంలో ఇటీవల హైదరాబాద్‌లో సమావేశం నిర్వహించారు. మంచిప్ప రిజర్వాయర్ నీటి సామర్థ్యం నిర్ధారణపై రీసర్వే చేపట్టాలని నిర్ణయించారు. భూసేకరణ, ఇతరత్రా పనుల పూర్తికి కావాల్సిన నిధులకు సంబంధించిన వివరాలతో అధికారులకు సమగ్ర నివేదిక సమర్పించాం.



ప్రభుత్వ వసతిగృహాల్లో నీటి శుద్ధి యంత్రాలు పనిచేయడం లేదు. ఫలితంగా విద్యార్థులు తాగునీటికి అవస్థలు పడుతున్నారు. గతంలో యంత్రాలు ఏర్పాటుచేసినా తర్వాత వాటి నిర్వహణ గాలికి వదిలేయడంతో నిరుపయోగంగా మారాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి పిల్లల ఆరోగ్యంపై దృష్టి సారించాలని.. స్వచ్ఛమైన నీటిని అందించేలా ఏర్పాటుచేయాలని కోరుతున్నారు.

శుద్ధ జలం.. ఉత్త ముచ్చట


➾ వసతిగృహాల్లో పనిచేయని యంత్రాలు

న్యూస్‌టుడే, నందిపేట్

విద్యార్థులు కుళాయి నీరు తాగి అనారోగ్యాల బారిన పడేవారు. సమస్యను తెలుసుకున్న ప్రభుత్వం జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతిగృహాలకు నీటి శుద్ధియంత్రాలు అందజేసింది. వీటి నిర్వహణ బాధ్యతలు ఓ కంపెనీకి కట్టబెట్టింది. తర్వాత నిర్వహణ పట్టింపు లేకపోవడం.. కొంత కాలానికి ఒప్పందం పూర్తయింది. ఫలితంగా యంత్రాలు చెడిపోయాయి. జిల్లాలో 70 శాతానికి పైగా వసతిగృహాల్లో ఇదే పరిస్థితి. సమస్యను పిల్లల తల్లిదండ్రులు అధికారులకు విన్నవించినా స్పందించకపోవడంతో పిల్లలు కుళాయి నీరే తాగుతున్నారు. కొన్ని చోట్ల ప్రైవేటు ప్లాంట్ల నుంచి వార్డెన్లు జలాన్ని తెప్పిస్తున్నారు.

జిల్లాలో వసతిగృహాల వివరాలు (పదో తరగతి వరకు)

శాఖ	హాస్టళ్లు	విద్యార్థులు
సాంఘిక సంక్షేమ	32	2100
వెనుకబడిన తరగతుల	19	1887
గిరిజన	6	1049



కుద్వాన్‌పూర్ బీసీ వసతిగృహంలో పనిచేయని ప్లాంటు

ముగిసిన మిషన్ల గడువు

నీటి శుద్ధి ప్లాంట్లు కొనుగోలు చేసిన సమయంలో విక్రయించిన కంపెనీ వీటి పనితీరును అధికారులకు తెలియజేసింది. ఇవి ఐదేళ్ల పాటు మాత్రమే పనిచేస్తాయని ఆ తర్వాత వాటి పరిస్థితి తెలుసుకొని వినియోగించుకోవాలని సూచించింది. జిల్లాలో 2014లో యంత్రాలు సరఫరా చేయగా 2019లో పనిచేసే గడువు ముగిసింది. అంతకు ముందే వీటిని పరిశీలించి ఎన్ని పనికి వస్తాయి. కొత్తవి ఎన్ని ఏర్పాటుచేయాలని ప్రణాళిక తయారు చేయాల్సి ఉన్నా అధికారులు పట్టించుకోలేదు. అధికారులు ఇప్పటికైనా దృష్టి సారించి నీటి సమస్యలు తీర్చాలని విద్యార్థులు కోరుతున్నారు.

ఇబ్బందులు లేకుండా చూస్తాం

- నిర్మల, జిల్లా సాంఘిక సంక్షేమాధికారిణి

నీటి శుద్ధి ప్లాంట్లు ఏర్పాటు చేసి చాలా కాలం అవుతోంది. అవి పనిచేయడం లేదని నా దృష్టికి వచ్చింది. కొత్తవి కొనుగోలు చేసేందుకు కొంత ఇబ్బందిగా ఉంది. వచ్చే విద్యా సంవత్సరంలో కొత్తవి అందుబాటులోకి తెస్తాం. అప్పటి వరకు విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.



ఉద్యోగార్థులతో మాట్లాడుతున్న రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ డా.రియాజ్

ఉద్యోగ ఖాళీలు భర్తీ చేస్తాం

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలన్నీ జాబ్ క్యాలెండర్ ప్రకారం భర్తీ చేస్తామని, అందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ డా.రియాజ్ అన్నారు. నిజామాబాద్ నుంచి ఆదిలాబాద్ వెళ్తున్న ఆయన ఆర్మూర్ గ్రంథాలయాన్ని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పుస్తకాల గదిని పరిశీలించారు. ఉదయమే పెద్ద సంఖ్యలో ఉద్యోగార్థులు రావడం చూసి సంతోషం వ్యక్తం చేశారు. ఎక్కడా లేని విధంగా నిజామాబాద్, ఆర్మూర్ గ్రంథాలయాలు ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు తెరిచి ఉంటున్నాయన్నారు. ఉద్యోగార్థులతో మాట్లాడారు. మూత్రశాలలు, మంచినీటి సౌకర్యం లేవని, పై అంతస్తు నిర్మాణ పనులు నెమ్మదిగా కొనసాగుతున్నాయని, దీంతో ఇబ్బందులు పడుతున్నామని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్, కార్యదర్శిని ఫోన్‌లో సంప్రదించి ఆదేశించారు. అవసరమైన నిధులు ఇస్తామని హామీ ఇచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి నిరుద్యోగులకు అండగా ఉన్నారని, నిరాశ చెందకుండా కష్టపడి చదవాలన్నారు. పుస్తకాలతో పాటు సంపుటాలు, ఈ-బుక్ పుస్తకాల ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రంథపాలకురాలు వరలక్ష్మి ఉద్యోగార్థులతో కలిసి ఆయనను సన్మానించారు. ఆయన వెంట డా.కంఠీకెర్ శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ వైద్యవిభాగం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని వెల్‌నెస్ సెంటర్‌లో రెండు ఎంబీబీఎస్ వైద్యుల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌ఛార్జి మెడికల్ ఆఫీసర్ కృష్ణవేణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు.

ఆడించేవారు లేక.. ఆటలకు దూరం..

● అండర్-19 జిల్లా జట్ల ఎంపికలో వీడని సందిగ్ధం

న్యూస్‌టుడే, నిజామాబాద్ విద్యావిభాగం

పాఠశాల దశలో క్రీడల్లో రాణించే విద్యార్థులకు మరింత నైపుణ్యం సాధించేలా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఏటా మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో పోటీలు నిర్వహిస్తోంది. అండర్-14, 17 విభాగాల్లో పాఠశాల విద్యార్థులు, అండర్-19 విభాగంలో ఇంటర్ వారికి పోటీలు నిర్వహిస్తున్నారు. పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయుల పర్యవేక్షణలో రాణిస్తున్న విద్యార్థులు కళాశాలల్లో చేరగానే ఆటలకు దూరమవుతున్నారు. ఎస్‌జీఎఫ్ క్రీడల్లో ఇంటర్ విద్యార్థులు పాల్గొని నైపుణ్యం ప్రదర్శించే అవకాశం ఉండగా.. ప్రస్తుతం ఫిజికల్ డైరెక్టర్లు (పీడీలు) లేకపోవడంతో వారితో సాధన చేయించలేని పరిస్థితి.

విద్యార్థులకు నష్టం..

ఏళ్లుగా జూనియర్ కళాశాలల్లో పీడీలను నియమించకపోవడంతో క్రీడలు కొనసాగించలేకపోతున్నామని విద్యార్థులు వాపోతున్నారు. పాఠశాల స్థాయిలోనే రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించిన విద్యార్థులు చాలామంది ఉన్నా.. పీడీలు లేరనే కారణంతో జట్టు ఎంపికకు ఇంటర్ విద్యాశాఖ వెనకడుగు వేస్తోంది. విద్యార్థులను అనుమతిస్తే తీసుకెళ్లేందుకు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు సిద్ధంగా ఉన్నా.. ఇంటర్ విద్యాశాఖ కమిషనర్ నుంచి అనుమతి రాలేదని ఉన్నతాధికారులు పేర్కొనడంతో విద్యార్థులకు తీవ్ర నష్టం జరుగుతోంది.

ఉమ్మడి జిల్లాలో ఇలా..

ఉమ్మడి జిల్లాలో నిజామాబాద్‌లో 16, కామారెడ్డిలో 21 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండగా.. కేవలం ఆర్మూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాత్రమే ఒక పీడీ ఉండేవారు. ఆయనే రెండు జిల్లాలకు ఎస్‌జీఎఫ్ కార్యదర్శిగా వ్యవహరిస్తూ తమ క్రీడాకారులతో ఎంపిక చేసిన ఇంటర్ జట్టును రాష్ట్రస్థాయికి పంపేవారు. సదరు పీడీ ఆరునెలల క్రితం పదవీ విరమణ పొందారు. ఈ క్రమంలో నవంబరు 3న నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు అండర్-14, అండర్-17 జట్ల ఎంపిక పూర్తికాగా.. అండర్-19 విభాగం ఎంపికలో తీవ్ర జాప్యం జరుగుతోంది. క్రీడల్లో ప్రతిభ చూపిస్తే ఉన్నత చదువులు చదివేందుకు, ఉద్యోగాలు మెరుగుపడతాయని విద్యార్థులు పేర్కొంటున్నారు.



సిర్పాపల్లిలో కబడ్డీ క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న తహసీల్దార్ వెంకట్రావు (పాతచిత్రం)

ఇలా చేయొచ్చు..

పాఠశాల స్థాయిలోని సీనియర్ పీడీని లేదా జూనియర్ కళాశాలల్లోని సీనియర్ అధ్యాపకుడిని కార్యదర్శిగా నియమించి.. పాఠశాల పీడీలతో ఎంపికలు పూర్తి చేసి రాష్ట్రస్థాయి పోటీలకు పంపొచ్చని క్రీడా నిపుణులు పేర్కొంటున్నారు. ఆ దిశగా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకొని కళాశాల జిల్లా జట్టు ఎంపిక చేసి రాష్ట్రస్థాయి పోటీలకు పంపేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.

నిధుల లేమి, భద్రత విషయంలో వెనకడుగు

- రవికుమార్, డీఐఈవో, నిజామాబాద్



ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఒక పీడీ లేకపోవడంతో సమస్య తలెత్తింది. జట్టును పంపాలంటే ఒకరికి బాధ్యత అప్పగించాలి. క్రీడాకారులను పోటీలకు తీసుకెళ్లాలంటే నిధులు అవసరం. భద్రత, నిధులు లేకపోవడం వల్లే విద్యార్థులను అనుమతించడం లేదు.

కొత్త రేషన్ డీలర్ల నియామకాల్లో జాప్యం

న్యూస్‌టుడే, కామారెడ్డి కలెక్టరేట్

కామారెడ్డి జిల్లాలో కొత్త రేషన్ డీలర్ల నియామకాల ప్రక్రియ నెమ్మదించింది. ఆగస్టులో రాత, మౌఖిక పరీక్షలు నిర్వహించి అర్హుల జాబితా విడుదల చేశారు. 70 మందికి నియామక పత్రాలు అందజేశారు. సెప్టెంబరులో ఆర్డీవో కార్యాలయాల్లో కొత్త డీలర్లకు లైసెన్స్‌లు జారీ చేశారు. కొత్త డీలర్ల జాబితా ఆర్డీవో కార్యాలయాల నుంచి పౌరసరఫరాల శాఖ కార్యాలయానికి వెళ్లింది. అక్కడ కొత్త డీలర్లు, వారి కుటుంబీకుల బయోమెట్రిక్ నమోదు ప్రక్రియ ఇంకా పూర్తికాలేదు. వాస్తవానికి అక్టోబరు నుంచే కొత్త డీలర్ల ప్రక్రియ పూర్తి చేసి రేషన్ దుకాణాలు కేటాయిస్తామని అధికారులు పేర్కొన్నారు. ఇప్పుడు నవంబరులో కూడా కొత్త దుకాణాల కేటాయింపు ఉంటుందో లేదోననే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.



త్వరగా పూర్తిచేస్తే మేలు

డీలర్ల పోస్టులు ఖాళీగా ఉన్న రేషన్ దుకాణాలను ఇన్‌ఛార్జులతో నెట్టుకొస్తున్నారు. ఒక్కో డీలర్‌కు రెండు మూడు దుకాణాలకు ఇన్‌ఛార్జిగా నియమించారు. దీంతో బియ్యం పంపిణీలో జాప్యం తలెత్తుతుంది. కొందరు లబ్ధిదారులు ఇతర గ్రామాల్లోని దుకాణాలకు వెళ్లి బియ్యం తెచ్చుకుంటున్నారు. కొత్త డీలర్ల నియామకాలు త్వరగా పూర్తి చేస్తే లబ్ధిదారులకు సకాలంలో బియ్యం పంపిణీ పూర్తవుతుంది. బయోమెట్రిక్ నమోదు అధికారాన్ని ప్రభుత్వం పౌరసరఫరాలశాఖకే అప్పగించింది. ఈ విషయమై ఇన్‌ఛార్జి డీఎస్‌వో నర్సింహారావును 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. బయోమెట్రిక్ నమోదు పూర్తి చేసిన తర్వాత కొత్త డీలర్ల వివరాలను కమిషనరేట్‌కు పంపించి, కొత్త దుకాణాలు కేటాయిస్తామన్నారు.



లైసెన్స్ పత్రాలను చూపుతున్న నూతన రేషన్ డీలర్లు



నాటిక ప్రదర్శిస్తున్న ప్రతినిధులు

బడుగుల బంధువు అంబేడ్కర్

భీమ్‌గల్ గ్రామీణం, న్యూస్‌టుడే: మాలల సంక్షేమ ఐక్య వేదిక అధ్వర్యంలో హైదరాబాద్‌కు చెందిన అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో బుధవారం భీమ్‌గల్ పట్టణంలో అంబేడ్కర్ జీవిత చరిత్రను 'సంఘం శరణం గచ్ఛామి' పేరుతో ప్రదర్శించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో దృశ్య కావ్యంలా ప్రదర్శన కొనసాగింది. అంబేడ్కర్ బాల్యం, విద్యాభ్యాసం, వివాహం, నిమ్నజాతుల హక్కులకు చేసిన పోరాటాలు, రాజ్యాంగ రచనకు సంబంధించిన ఘట్టాలను ప్రదర్శించారు. అంబేడ్కర్ బడుగుల బంధువని వక్తలు పేర్కొన్నారు. అకాడమీ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు 678 నాటిక ప్రదర్శనలు ఇచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో దళిత బహుజన నాయకులు, మాలల సంక్షేమ ఐక్య వేదిక ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



తరగతి గదిని తనిఖీ చేస్తున్న వీసీ ఆచార్య యాదగిరిరావు

సమయపాలన పాటించాలి

తెవివి క్యాంపస్, న్యూస్‌టుడే: తెవివిలోని ఆయా కళాశాలల తరగతులను వీసీ ఆచార్య టి.యాదగిరిరావు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అధ్యాపకుల బోధన తీరును పర్యవేక్షించారు. అందరూ విధిగా సమయపాలన పాటించాలని, అనుమతి తీసుకొని మాత్రమే సెలవును వినియోగించుకోవాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. విద్యార్థుల హాజరు శాతాన్ని మెరుగు పర్చాలన్నారు. రిజిస్ట్రార్ యాదగిరి, ప్రిన్సిపల్ ఆరతి, వైస్ ప్రిన్సిపల్ సత్యనారాయణరెడ్డి తదితరులున్నారు.

నేడు, రేపు ఇంటర్ కాలేజ్ ఎంపికలు

తెవివి క్యాంపస్, న్యూస్‌టుడే: తెవివి క్రీడా మైదానంలో ఇంటర్ కాలేజ్ ఎంపికలు చేపట్టినట్లు స్పోర్ట్స్ డైరెక్టర్ బాలకిషన్ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 7 గంటలకు బాలుర బ్యాడ్మింటన్, శనివారం ఉదయం 10.30 గంటలకు బాలుర కబడ్డీ జట్టు ఎంపిక ఉంటుందన్నారు.



ఉపకులపతికి సన్మానం

తెవివి క్యాంపస్ : తెవివి వీసీ ఆచార్య టి.యాదగిరిరావును గురువారం నిజామాబాద్ ఎస్బీ ఏసీపీ శ్రీనివాస్‌రావు, భిక్కనూరు దక్షిణ ప్రాంగణ ఒప్పంద అధ్యాపకుల అసోసియేషన్ ఆధ్వర్యంలో వేర్వేరుగా మర్యాదపూర్వకంగా కలిశారు. వీసీకి పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

సభకు తరలిన పీడీఎస్‌యూ కార్యకర్తలు

తెవివి క్యాంపస్, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లోని ఓయూలో జరిగే పీడీఎస్‌యూ అర్ధ శతాబ్ది ఉత్సవ సభకు గురువారం జిల్లా నుంచి వందలాది పీడీఎస్‌యూ కార్యకర్తలు తరలివెళ్లారు. తెవివి వద్ద బస్సును పీడీఎస్‌యూ తొలితరం నాయకులు పాపయ్య, రాష్ట్ర మాజీ సహాయ కార్యదర్శి సరిత జెండా ఊపి ప్రారంభించారు. కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్, వర్సిటీ నాయకులు ప్రిన్స్, రవీందర్, అక్షయ్, బిందు, ప్రణయ్, సాయిరాం, ఆకాశ్, హన్మాండ్లు తదితరులున్నారు.



జెండా ఊపుతున్న పీడీఎస్‌యూ నాయకులు



శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న బెటాలియన్ ఇన్‌ఛార్జి కమాండెంట్ సురేశ్

బెటాలియన్‌లో రక్తదాన శిబిరం

డిచ్‌పల్లి, న్యూస్‌టుడే: పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా డిచ్‌పల్లి ఏడో బెటాలియన్‌లో గురువారం జిల్లా ప్రభుత్వాసుపత్రి సహకారంతో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఇన్‌ఛార్జి కమాండెంట్ సురేశ్ శిబిరాన్ని పర్యవేక్షించారు. 20 మంది సిబ్బంది రక్తదానం చేశారు. బెటాలియన్ యూనిట్ ఆసుపత్రి మెడికల్ అధికారిణి అనుపమా, ఆర్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం ప్రైవేటులో విక్రయించొద్దు

డిచ్‌పల్లి, న్యూస్‌టుడే: రైతులు వరి ధాన్యం ప్రైవేటుకు విక్రయించి మోసపోవద్దని ఐడీసీఎంఎస్ ఛైర్మన్ తారాచంద్ నాయక్ పేర్కొన్నారు. సుద్దపల్లిలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని గురువారం ప్రారంభించి మాట్లాడారు. డిచ్‌పల్లి సొసైటీ ఛైర్మన్ రాంచందర్‌గౌడ్, వైస్ ఛైర్మన్ కుమ్మరి గంగారాం, మాజీ ఎంపీపీలు కంచెట్టి గంగాధర్, చిన్నోళ్ల నర్సయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్, డీసీసీబీ డైరెక్టర్ రాజేశ్వర్, నాయకులు తదితరులున్నారు.




ధాన్యం తూకం వేస్తున్న ఐడీసీఎంఎస్ ఛైర్మన్ తారాచంద్ నాయక్

పచ్చని అందం.. చూడచక్కని చందం



వాచ్ టవర్ పై నుంచి కనిపిస్తున్న అటవీ ప్రాంతం

దట్టమైన అడవి.. పచ్చని చెట్లు.. చల్లని వాతావరణంతో నిజామాబాద్ ఆర్మూర్ మార్గంలోని అర్బన్ పార్కు పర్యాటకులను ఆకర్షిస్తోంది. జంతువుల బొమ్మలు.. గోడలపై పెయింటింగ్‌లు చూపరులకు కనువిందు చేస్తున్నాయి. ఆదివారం వస్తే జిల్లాకేంద్రంతో పాటు ఇతర మండలాల ప్రజలు అక్కడికి వరుస కడుతున్నారు. వాకింగ్‌ట్రాక్, ఓపెన్‌జిమ్ ఏర్పాటుచేయడంతో సందర్శకులు వ్యాయామాలు సైతం చేస్తున్నారు. - ఈనాడు, నిజామాబాద్



గోడలపై వేసిన చిత్రాలు

కాలనీలు పరిశీలించిన నగర కమిషనర్

నిజామాబాద్ నగరం, న్యూస్‌టుడే: నగరంలోని పలు డివిజన్లను గురువారం నగరపాలక సంస్థ కమిషనర్ మకరందు పరిశీలించారు. 50వ డివిజన్‌లో రోడ్లు, మురుగు కాలువలను పరిశీలించారు. కమిటీ హాలు పూర్తి కావడానికి అయ్యే ఖర్చు అంచనా వేసి మిగిలిన పనులకు త్వరలోనే నిధులు విడుదల చేస్తామన్నారు. అనంతరం 39వ డివిజన్‌లోని హమాల్‌వాడి ప్రాంతంలో మురుగు కాలువలను, రైతు బజార్ కోసం ఏర్పాటు చేసిన షెడ్లను పరిశీలించారు. వర్షం నీరు రోడ్లపైకి వస్తుందని కార్పొరేటర్ వివరించగా.. స్టామ్ వాటర్ డ్రైనేజీకి నిర్మిస్తామని చెప్పారు. మురుగు కాలువల పూడిక ఎప్పటికప్పుడు తీయాలని ఆదేశించారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిశీలించి క్షేత్రస్థాయిలో ప్లాట్లను పరిశీలించారు. నిబంధనలను పరిశీలించాలని అధికారులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రాఘవేందర్, ఎర్రం సుధీర్, నగరపాలక సంస్థ ఏఈలు ఇనాయత్, పావని, మహిపాల్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



వివరాలు తెలుసుకుంటున్న నగర కమిషనర్ మకరందు, టౌన్‌ప్లానింగ్ అధికారులు

ఖాతాదారుడికి తెలియకుండా రూ.5 లక్షలు మాయం

నిజామాబాద్ నేరవిభాగం, న్యూస్‌టుడే: కష్టపడి రూపాయి.. రూపాయి కూడబెట్టుకొని ఖాతాలో దాచుకుంటే సైబర్ మోసగాళ్లు నగదంతా కాజేయడంతో బాధితుడు లబోదిబోమంటున్నారు. వివరాల్లోకి వెళ్తే.. వినాయక్‌నగర్‌లో నివాసం ఉంటున్న ఓ యువకుడు.. వివిధ పనులు చేస్తూ డబ్బులు పొదుపు చేసి ఖాతాలో జమ చేసుకున్నారు. ఇటీవల తన క్రెడిట్ కార్డు నుంచి రూ.50 వేలు వాడుకున్నట్లు సమాచారం రావడంతో దాన్ని బ్లాక్ చేయించారు. ఎందుకైనా మంచిదని బ్యాంకు వెళ్లి లావాదేవీల గురించి ఆరా తీయగా ఈ నెల 20న తన ఖాతాలోని రూ.5 లక్షల నగదు ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఓ బ్యాంకు ఖాతాకు బదిలీ అయినట్లు తేలింది. కంగారుపడ్డ బాధితుడు సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు. గురువారం కేసు నమోదు చేసుకొని విచారణ ప్రారంభించారు. అనవసరమైన లింకులు తెరిస్తేనే ఇలాంటి ఇబ్బందులు వస్తాయని, ఎవరికి వారు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి

బోధన్ (గ్రామీణం, న్యూస్‌టుడే): విద్యార్థులు డ్రగ్స్, గంజాయి, మద్యం వంటి మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని, వాటికి దూరంగా ఉండాలని యాంటీ నార్కోటిక్ బ్యూరో ఏసీపీ సోమనాథం సూచించారు. ఈ మేరకు గురువారం బోధన్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. మత్తు పదార్థాలకు అలవాటు పడితే ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటారన్నారు. మాదకద్రవ్యాల వినియోగం కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. క్రమశిక్షణతో చదువుకుని లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. అనంతరం డ్రగ్స్‌కు దూరంగా ఉంటామంటూ విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. సమావేశంలో సీఐలు పుల్లేశ్వర్, వెంకటనారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

నిజామాబాద్

• నిజామాబాద్ అర్బన్ • నిజామాబాద్ రూరల్ • బోధన్ • బాన్సువాడ

గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌కు సన్మానం

నిజామాబాద్ అర్బన్, బోధన్ గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ రాజిరెడ్డిని బోధన్ బల్దియా వైస్ పర్సన్ పద్మ దంపతులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో శరత్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.





ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్ (గీత ఏసియన్)
స్క్రీన్-1: లగ్గం: 10.40, 4.40
విశ్వం: 1.30, 7.30 **వెట్టయాన్:** 10.40(రాత్రి)
స్క్రీన్-2: వేనమ్ (తెలుగు)3డీ: 11.00, 1.45, 7.35
వేనమ్ (ఇంగ్లిషు)3డీ: 4.35, 10.30(రాత్రి)
స్క్రీన్-3: వెట్టయాన్: 1.35
పొట్టేల్: 4.40, 10.30(రాత్రి) **దేవర-I:** 7.35
పీవీఆర్ మల్టీప్లెక్స్ (విజయమాల్)
స్క్రీన్-1: వేనమ్(తెలుగు)3డీ: 11.25, 2.00
వేనమ్ (ఇంగ్లిషు)3డీ: 4.35, 7.10, 10.20(రాత్రి)
స్క్రీన్-2: నరుడి బ్రతుకు నటన: 1.05
దేవర పార్ట్-I: 4.00 **జనక అయితే గనక:** 7.35
విశ్వం: 10.35(రాత్రి)
స్క్రీన్-3: జనక అయితే గనక: 12.40
పొట్టేల్: 4.20, 10.25(రాత్రి)
నరుడి బ్రతుకు నటన: 7.30
స్క్రీన్-4: ఎంత పనిచేశావ్ చంటి: 11.00
లగ్గం: 1.55, 7.50 **సముద్రుడు:** 4.45
వెట్టయాన్: 10.40(రాత్రి)
దేవి (ఏసీపీ): పొట్టేల్
11.15, 2.15, 6.15, 9.15(రాత్రి)
నటరాజ్(గీతా ఏసియన్): విశ్వం
11.00, 2.20, 6.00, 9.20(రాత్రి)
లలితామహల్(ఏసీపీ): దేవర పార్ట్-I
10.45, 2.15, 6.00, 9.30(రాత్రి)
విజయ్(ఏసీపీ): వేనమ్(తెలుగు)-3డీ
11.00, 2.15, 6.00, 9.15(రాత్రి)
– న్యూస్‌టుడే, నిజామాబాద్ సాంస్కృతికం

మేమున్నాం.. మీకు తోడుగా..

94408 85670
80085 74007
98850 93048



సమస్య: బోర్గం(పి) చౌరస్తాలో హైమాస్ట్ దీపాలు వెలగడం లేదు.
– సాయిరెడ్డి, స్థానికుడు
సమాధానం: హైమాస్ట్ దీపాలు అందుబాటులో లేవు. బిల్లింగ్ త్వరలో తెప్పించి పెట్టిస్తాం. – వాజిద్, ఏఈ
సమస్య: ఆర్యనగర్‌లో కాలువల్లో పూడిక తీయడం లేదు. – ప్రతాప్‌రెడ్డి, స్థానికుడు
సమాధానం: మురుగు కాలువలు వెంటనే శుభ్రం చేయించి దోమల మందు సైతం పిచికారీ చేయిస్తాం. – సునీల్, పారిశుద్ధ్య పర్యవేక్షకుడు
సమస్య: గాయత్రి నగర్‌లో తాగునీటి పైపులైన్లు పాడవడంతో మూడేళ్లుగా తాగునీరు రావడం లేదు. రోడ్లు గుంతలమయంగా మారాయి. – స్థానికులు
సమాధానం: కొత్త పైపులైన్ వేయాల్సి ఉంటుంది. అమృత్ పథకం కింద పైపులైన్లు వేసేందుకు ప్రణాళిక రూపొందించాం. త్వరలో పనులు ప్రారంభిస్తాం. రోడ్లు సైతం నగరపాలక సంస్థ నిధులతో వేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. – వాజిద్, ఏఈ
సమస్య: వినాయక్‌నగర్ మహాలక్ష్మీనగర్ కాలనీలో మట్టి రోడ్లు వర్షం కురిస్తే బురదగా మారుతున్నాయి. – రంజిత్, స్థానికుడు
సమాధానం: రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేస్తున్నాం. నిధులు మంజూరు కాగానే రోడ్లు వేస్తాం. – ఇనాయత్, ఏఈ, జోన్-2, నగర పాలక సంస్థ
– న్యూస్‌టుడే, నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ నగరం

గ్రామీణ మండలం ఖానాపూర్, కాలూరు, గుండారం, కొండూరు గ్రామాల ప్రజలు సమీప పేపర్, ధాన్యం తదితర మిల్లుల నుంచి వెలువడే వ్యర్థాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం వెలువడే దుమ్ము, సన్నని బూడిద, వడ్ల పొట్టు సమీప ఇళ్లలోకి వస్తుండటంతో ప్రజలు నానా అగచాట్లు పడుతున్నారు. ఆయా గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై కథనం.

పారిశ్రామిక వ్యర్థాలు.. ప్రజల అవస్థలు

న్యూస్‌టుడే, మోపాల్ (నిజామాబాద్ గ్రామీణం)

మిల్లుల నుంచి వెలువడే వ్యర్థ జలాలను ఖానాపూర్, కాలూరు, దుబ్బ శివారుల్లోని పంట కాలువలకు, చెరువుల్లోకి వదులుతున్నారు. దుబ్బ శివారులోని ఎల్లయ్ చెరువులోకి మురుగు తరలించడానికి కొందరు మిల్లుల యజమానులు చెరువులోకి పైపులైన్ వేశారని స్థానికులు చెబుతున్నారు. కాలూరులోని గొల్ల కుంట, తుట్టకుంట, ఊర చెరువు, కొండూరు పాలే చెరువుల్లోనూ ఇదే పరిస్థితి. చేపలు సైతం మృత్యువాత పడుతున్నాయని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ భూముల్లోకి చేరడంతో పంటలు పండటం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.



పంట కాల్వల్లో కలుషిత నీరు

రోడ్లపై మురుగు

వ్యర్థ నీటిని రోడ్లపైకి వదలడంతో దుర్గంధం వెదజల్లుతోంది. కాలూరు నుంచి దుబ్బ బైపాస్ రోడ్డు వరకు దుమ్ము, సన్నని బూడిద, వడ్ల పొట్టు లేస్తోంది. దీంతో అటుగా ప్రయాణించే వారు ముక్కు మూసుకుని వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది.

ఫిర్యాదు చేసినా..

అధికారులకు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా, ధర్నాలు, రాస్తారోకోలు చేసినా ఫలితం లేకుండా పోయిందని వివిధ గ్రామాల రైతులు వాపోతున్నారు. రూరల్ తహసీల్దార్, మున్సిపల్ అధికారులకు తమ గోడును చెప్పుకొన్నారు. ఈ నెల 21న నిర్వహించిన ప్రజావాణిలోనూ తమ సమస్యలు పరిష్కరించాలని రైతులు జిల్లా పాలనాధికారిని కలిసి వేడుకున్నారు.

ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు

మిల్లుల యజమానులు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. కలుషిత నీటితో వ్యవసాయ భూములు పాడవుతున్నాయి. చెరువులు, కాల్వలు మురుగునీటితో నిండిపోయాయి. ఎక్కడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. అనారోగ్య సమస్యలు వస్తున్నాయి. తగు చర్యలు తీసుకోవాలి.
– అగ్గు నారాయణ, వీడీసీ అధ్యక్షుడు, కాలూరు

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం

మండలంలోని పలు గ్రామాలకు చెందిన ప్రజలు ఈ సమస్యలపై వినతిపత్రం అందించారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.
– అనురోధ్, తహసీల్దార్, గ్రామీణ మండలం

రక్తదానంతో ప్రాణాలు కాపాడొచ్చు

నిజామాబాద్ నేరవిభాగం, సిరికొండ: న్యూస్‌టుడే: అత్యవసర పరిస్థితిలో ప్రాణాలు కాపాడటానికి రక్తదానం ఉపయోగపడుతుందని అదనపు డీసీపీ (అడ్మిన్)కోటేశ్వర్‌రావు పేర్కొన్నారు. నగరంలోని పరేడ్ మైదానంలో గురువారం పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఇందులో 49 మంది పోలీసు సిబ్బంది రక్తదానం చేశారు. తలసేమియా వ్యాధిగ్రస్తులకు, ప్రమాదాల సమయంలో రక్తం అవసరం ఉంటుందన్నారు. యువత రక్తదానం చేయడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్మ్‌డ్ రిజర్వు ఏసీపీ నాగయ్య, ట్రాఫిక్ ఏసీపీ నారాయణ, పోలీసు యూనిట్ ఆఫీసర్ సరళ, సీఐ సతీశ్, రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధి తోట రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో మండలంలోని తూంపల్లి చెందిన హెల్పింగ్ హార్ట్స్ ఫౌండేషన్ సభ్యులు రక్తదానం చేసినట్లు ధర్పల్లి సీఐ భిక్షపతి, ఎస్సై రామ తెలిపారు. సభ్యులు శ్రీకాంత్, కోటేశ్వర్, రాజేందర్, సుదర్శన్‌గౌడ్, నరేందర్ తదితరులు పాల్గొన్నట్లు పేర్కొన్నారు.



రక్తదాన శిబిరంలో అదనపు డీసీపీ(అడ్మిన్) కోటేశ్వర్‌రావు, ఇతర అధికారులు

కేటీఆర్‌కు ఘన స్వాగతం

ఇందల్‌వాయి, న్యూస్‌టుడే: ఆదిలాబాద్ పర్యటనకు వెళ్తున్న భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్‌కు గురువారం ఇందల్‌వాయి టోల్‌ప్లాజా వద్ద మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్ ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా కేటీఆర్ కార్యకర్తలతో మాట్లాడారు. పార్టీ మండలాధ్యక్షుడు దాసు, జడ్పీటీసీ మాజీ సభ్యులు సుమనారెడ్డి, జగన్, మాజీ ఎంపీపీ రమేష్‌నాయక్, నాయకులు రఘునందన్, కుమార్, రఘు పాల్గొన్నారు.



మాజీ మంత్రి కేటీఆర్‌కి భారాస నాయకులను పరిచయం చేస్తున్న బాజిరెడ్డి గోవర్ధన్

కేంద్ర పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

సిరికొండ, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని భాజపా జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి సూచించారు. సిరికొండ మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ప్రజా సమస్యలపై పోరాడాలని దిశా నిర్దేశం చేశారు. భాజపా సభ్యత్వ నమోదు అధిక సంఖ్యలో చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రాజేశ్వర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి రాజేశ్వర్, గంగారెడ్డి, రామస్వామి, శ్రీనివాస్, బాలయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న దినేష్ కులాచారి



ప్రమాదకరంగా పొదలు

బోధన్ మండలం కొప్పర్గ- హంగర్గ గ్రామాల మధ్య ర.భ రహదారిని ఆనుకుని ముళ్లపొదలు ప్రమాదకరంగా మారాయి. రహదారిపైకి పొదలు విస్తరించడంతో రోడ్డు ఇరుకుగా మారింది. మూలమలుపు వద్ద పొదలతో దారి కనిపించక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. సంబంధిత అధికారులకు విన్నవించినా స్పందించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ర.భ అధికారులు స్పందించి పెరిగిన పొదలను తొలగించాలని వారు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, బోధన్ గ్రామీణం

విచారణ ప్రారంభం

నిజామాబాద్ విద్యావిభాగం: జిల్లా విద్యాశాఖలో సెలవుల్లో వెళ్లిన ఉపాధ్యాయిని మూడు నెలల వేతనం చెల్లించిన మతనపై విచారణకు ఆదేశించినట్లు డీఈవో దుర్గాప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చెల్లించిన వేతనం చలాన్ నంబరు 6402577267 ద్వారా ప్రభుత్వ ఖజానాలో జమచేశారని, నివేదిక వచ్చిన తర్వాత నిబంధనల మేరకు చర్యలు ఉంటాయన్నారు.



రెండు నెలల దీర్ఘకాలిక సెలవుల్లో వెళ్లడంతో సేవలు నిలిచిపోయాయని గురువారం 'ఈనాడు'లో 'కార్యదర్శి సెలవులు.. నిలిచిన సేవలు' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన ఎంపీవో రాములు సిర్పూర్ కార్యదర్శి నవీన్‌కుమార్‌కు మంచిప్ప పంచాయతీ అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఆదేశాలు జారీ చేశారు. సాధారణ విధులు నిర్వహిస్తారని ఆదేశాల్లో పేర్కొన్నారు.

సరిహద్దులో ప్రత్యేక తనిఖీలు

బోధన్ గ్రామీణం: వచ్చే నెలలో మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో సరిహద్దు గ్రామాల్లో ప్రత్యేక తనిఖీలు చేపడుతున్నట్లు బోధన్ గ్రామీణ ఎస్సై మశ్చేందర్‌రెడ్డి తెలిపారు. సాలూర, ఖండగాం తనిఖీ కేంద్రాల్లో నిరంతరం తనిఖీలు చేపడుతున్నట్లు చెప్పారు. గురువారం సీఐ విజయ్‌బాబు కేంద్రాలను సందర్శించారు. ఇరు రాష్ట్రాలకు రాకపోకలు సాగించే వాహనాలను తనిఖీ చేయాలని పోలీసు సిబ్బందికి సూచించారు.

సిర్పూర్ కార్యదర్శికి అదనపు బాధ్యతలు

మోపాల్: మంచిప్ప కార్యదర్శి శ్యామ్‌కుమార్

నూతన బాధ్యులకు అభినందన

నిజామాబాద్ సాంస్కృతికం: విశ్వహిందూ పరిషత్ ఇందూరు శాఖ ఆధ్వర్యంలో గురువారం నగరంలోని జిల్లా కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నగర ఉపాధ్యక్షుడిగా సీకేశ్, నగర గోరక్ష విభాగ్ రణదీప్‌ను ఎన్నుకొని బాధ్యతలను జిల్లా అధ్యక్షుడు దినేష్ ఠాకూర్ అప్పగించారు. కార్యక్రమంలో ఆనంద్, దయానంద్, రమేశ్, శేఖర్, మహేశ్, రామ్‌చట్రీ, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

శతశాతం ఉత్తీర్ణత సాధించాలి

కోటగిరి: నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించే దిశగా విద్యార్థులను తీర్చిదిద్దాలని డీఐఈవో రవికుమార్ పేర్కొన్నారు. కోటగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన గురువారం సందర్శించారు. అధ్యాపకులు, విద్యార్థుల హాజరుశీరు పరిశీలించారు. పాఠ్యాంశాల బోధన సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. నిజామాబాద్, బిచ్కుంద ఐటీఐ కళాశాలల్లో నూతన కోర్సులు ప్రవేశ పెట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఖైసర్‌పాషా, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

నిందితులపై చర్యలు తీసుకోవాలి

రుద్రూర్: దేవాలయంలో విగ్రహాలు ధ్వంసం చేసిన నిందితులపై చర్యలు తీసుకోవాలని హిందూ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సంఘాల పిలుపు మేరకు గురువారం రుద్రూర్ మండల బంద్ ప్రశాంతంగా సాగింది. ఉదయం నుంచే వ్యాపారులు స్వచ్ఛందంగా దుకాణాలు మూసివేశారు. అనంతరం గ్రామంలోని ప్రధాన వీధుల మీదుగా ర్యాలీ నిర్వహించారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ తారాబాయికి అందజేశారు. అనంతరం లక్ష్మీగణపతి ఆలయంలో పూజలు, భజన చేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్, హిందూ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆవిర్భావ దినోత్సవం జయప్రదానికి పిలుపు

ఖలీల్‌వాడి: ఈ నెల 30, 31 తేదీల్లో నిర్వహించనున్న ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవాలను జయప్రదం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి ఓమయ్య పేర్కొన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. చక్రపాణి, హనుమన్న, దేవేందర్, అనిల్, పరశురాం తదితరులు పాల్గొన్నారు.

చేప పిల్లల పంపిణీ

జక్రాన్‌పల్లి: చేప పిల్లల పెంపకంతో మత్స్యకారులు ఉపాధి పొందాలని జిల్లా మత్స్యశాఖాధికారి ఆంజనేయస్వామి సూచించారు. గురువారం జక్రాన్‌పల్లిలో ప్రభుత్వం అందించిన రాయితీ చేప పిల్లలను వివిధ గ్రామాల మత్స్యకారులకు అందించి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా ప్రమోటర్లు శ్రీనివాస్, భాస్కర్, మండల సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ, తహసీల్దార్ కిరణ్మయి, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు చిన్నారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



గోడ ప్రతులు చూపుతున్న నాయకులు



గోడప్రతుల ఆవిష్కరణ

బోధన్ (గ్రామీణం, న్యూస్‌టుడే): మహారాష్ట్రలోని శ్రీ క్షేత్రము కపిలేధార్ మన్మథస్వామి పుణ్యక్షేత్ర 15వ పాదయాత్ర నవంబర్ 2న బోధన్ నుంచి ప్రారంభించనున్నట్లు వీరశైవ జంగము, లింగాయత్ సమాజ్ ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు గురువారం పట్టణంలో కార్యక్రమానికి సంబంధించిన గోడప్రతులు ఆవిష్కరించారు. వచ్చే నెల 2న చక్రేశ్వర శివాలయం నుంచి పాదయాత్ర ప్రారంభమై వారం పాటు కొనసాగుతుందని వివరించారు. కార్యక్రమంలో వీరశైవ లింగాయత్ సమాజ్ జిల్లా అధ్యక్షుడు వీఆర్ దేశాయ్, కార్యదర్శి యాదవరావు, రాష్ట్ర నాయకులు శ్యామరావు, గుమ్మ సమాజ్ జిల్లా కన్వీనర్ ఆయుణ్‌కుమార్, ప్రతినిధులు నర్సింగ్‌రావు, రాజేందర్‌ప్పా, శివానంద్ పాల్గొన్నారు.

26 నుంచి సీపీఎం జిల్లా మహాసభలు

ఖలీల్‌వాడి, నవీపేట, న్యూస్‌టుడే: సీపీఎం జిల్లా మహాసభలు ఈ నెల 26, 27 తేదీల్లో నిర్వహించనున్నందున జయప్రదం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు పేర్కొన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో సంబంధిత గోడ ప్రతులను ఆవిష్కరించారు. 26న ధర్నాచౌక్ నుంచి రైల్వేస్టేషన్ మీదుగా రాజీవ్‌గాంధీ ఆడిటోరియం వరకు ర్యాలీగా వెళ్లి సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు, కార్మికులు, రైతులు హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు. వెంకట్రాములు, నూర్జహాన్, వెంకటేష్, శంకర్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు. సీపీఎం జిల్లా మహాసభలు ఈ నెల 26, 27వ తేదీల్లో నిజామాబాద్‌లోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నవీపేట మండల కార్యదర్శి శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

రైసుమిల్లులపై చర్యలు తీసుకోవాలని వినతి

నిజామాబాద్ నగరం, న్యూస్‌టుడే: కొత్త కలెక్టరేట్ సమీపంలోని కాలూరు గ్రామ శివారులోని 14 రైసుమిల్లులపై చర్యలు తీసుకోవాలని గురువారం నగర కమిషనర్ మకరందుకు కాలూరు గ్రామస్థులు, రైతులు వినతి పత్రం ఇచ్చారు. మిల్లుల్లో ఆర్వో ప్లాంట్లు లేకపోవడంతో కలుషితమైన నీటిని బయట పంట పొలాలకు వదులుతున్నారన్నారు. ఈ కారణంగా పశువులు మృతి చెందుతున్నాయని, ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని తెలియజేశారు. మిల్లుల్లోని కార్మికుల రోడ్ల పక్కనే మలవిసర్జన చేస్తున్నారని వివరించారు. స్పందించిన కమిషనర్ కాలుష్య నియంత్రణ మండలి అధికారులు అన్ని రైసు మిల్లులు తనిఖీ చేయాలని వారికి లేఖ రాశారు.



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కాలూరు గ్రామస్థులు

అభివృద్ధి పనుల ప్రారంభం

నిజామాబాద్ నగరం, న్యూస్‌టుడే: నగరంలోని పలు డివిజన్లలో రోడ్లు, సీసీ డ్రైనేజీలకు మేయర్ నీతూకిరణ్ గురువారం భూమిపూజ చేశారు. 8వ డివిజన్ గణేష్‌నగర్ కాలనీలో రూ.10 లక్షలతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. 14వ డివిజన్లో రూ.10 లక్షలతో సీసీ రోడ్లు, కల్వర్టు, 30వ డివిజన్లో సీసీరోడ్డు, 54వ డివిజన్లో సీసీరోడ్లు, డ్రైనేజీ, 55వ డివిజన్ మాలపల్లిలో సీసీ డ్రైనేజీ, 19వ డివిజన్లో రూ.10 లక్షలతో సీసీ రోడ్డుకు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఇద్రీసాన్, కార్పొరేటర్లు విక్రమ్‌గౌడ్, షకీల్, నసీర్, స్రవంతి, శ్రీనివాస్, నగరపాలక సంస్థ అధికారులు పాల్గొన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో దుర్గాప్రసాద్

సర్వీసు నిబంధనలపై అవగాహన

నిజామాబాద్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: నగరంలోని ఆర్‌పీఆర్‌ఆర్ ఉన్నత పాఠశాలలో గురువారం తెలంగాణ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ప్రధానోపాధ్యాయులకు సర్వీసు నిబంధనలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డీఈవో దుర్గాప్రసాద్ హాజరై మాట్లాడారు. నిబంధనలు తెలుసుకుని, పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజగంగారెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మోహన్, నరేష్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు సురేష్, పీఆర్టీయూ జిల్లాధ్యక్షుడు మోహన్‌రెడ్డి, ధ్రువకుమార్, టీసీఈటీ కార్యదర్శి సీతయ్య, ఎంఈవో సాయిరెడ్డి, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

చెరువులో పడి మృతి

ఎడపల్లి, న్యూస్‌టుడే: ఎడపల్లికి చెందిన నారాయణ(43) గ్రామ పులి చెరువులో ప్రమాదవశాత్తు పడి మృతి చెందారని ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. నారాయణ బుధవారం కాలకృత్యాలకు చెరువు వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు నీట మునిగి చనిపోయారు. గురువారం ఉదయం నీటిలో మృతదేహాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బోధన్ ప్రభుత్వ దవాఖానాకు తరలించామని, మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని వివరించారు.



నారాయణ

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు

సిరికొండ, న్యూస్‌టుడే: సిరికొండ అటవీ ప్రాంతంలోని లొంకరామలింగేశ్వర స్వామి ఆలయానికి వెళ్లేదారిలో హైలెవల్ వంతెన నిర్మాణానికి రూ.3 కోట్లు మంజూరు చేయించడంలో కృషిచేసిన రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డికి గ్రామస్థులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఆలయ అభివృద్ధికి మరిన్ని నిధులు విడుదల చేయించాలని కోరారు. మండలాధ్యక్షుడు రవి, డీసీసీ కార్యదర్శి ఎర్రన్న, సాయిలు, రాజేందర్‌గౌడ్, నర్సయ్య, మహేష్‌రెడ్డి, మల్లేష్, చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నివాసం ఉంటున్న అంది శ్రీనివాస్(50) ఒంటరిగా జీవిస్తున్నాడు. గురువారం ఉదయం ఇంటి బయట ఉన్న మెట్లు ఎక్కుతుండగా జారిపడటంతో పక్కనే ఉన్న రాళ్లపై పడ్డారు. తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో గంగాధర్ తెలిపారు.

మెట్లపై నుంచి జారిపడి..

నిజామాబాద్ నేరవిభాగం, న్యూస్‌టుడే: ఐదో టౌన్ ప్రాంతంలో ప్రమాదవశాత్తు మెట్లపై నుంచి జారిపడి వ్యక్తి మృతి చెందారు. పోలీసుల వివరాల ప్రకారం.. నగరంలోని ఆనంద్‌నగర్‌లో

రైలు కిందపడి ఆత్మహత్య

నిజామాబాద్ నేరవిభాగం, న్యూస్‌టుడే: జీవితంపై విరక్తిచెందిన ఓ యువకుడు రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. నిజామాబాద్‌కు చెందిన ముజీబ్ ఖాన్(26) ఒంటరిగా ఉంటున్నారు. ముజీబ్ కొంత కాలం క్రితం భార్య మృతిచెందడంతో మనస్తాపానికి గురై మద్యానికి బానిసయ్యారు. గురువారం జాన్కంపేట రైల్వేస్టేషన్ వద్ద గుర్తుతెలియని రైలుకు అడ్డుగా వెళ్లడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

నవీపేట, న్యూస్‌టుడే: నవీపేట శివారులో గురు

క్రైమ్ కార్నర్

వారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడ్డారు. గ్రామస్థుల కథనం ప్రకారం.. ఫకీరాబాద్‌కు చెందిన గంగాధర్ ద్విచక్ర వాహనంపై నవీపేట మీదుగా స్వగ్రామం వెళ్తున్నారు. లింగమయ్య గుట్టకాలనీ మూల మలుపు కూడలి వద్దకు రాగానే ముందు వెళ్తున్న కారును గంగాధర్ వెనుక నుంచి ఢీకొట్టారు. ఈ ఘటనలో గంగాధర్ బైకు వాహనంపై నుంచి కింద పడటంతో తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రుడిని 108 అంబులెన్స్‌లో నిజామాబాద్ జీజీహెచ్‌కు తరలించారు. ఫిర్యాదు అందలేదని పోలీసులు పేర్కొన్నారు.

ఆవు దాడిలో పలువురికి..

ఎడపల్లి, న్యూస్‌టుడే: జానకంపేటలో గురువారం ఆవు పలువురిపై దాడి చేసి గాయపర్చింది. గ్రామస్థుల కథనం ప్రకారం.. ఆవుకు ఇటీవల పిచ్చి కుక్క కరవడంతో వింతగా ప్రవర్తిస్తోంది. ఈ క్రమంలో కనిపించిన వారిని పొడుస్తోంది. ఆవు దాడిలో ఇప్పటి వరకు పది మందికి పైగా గాయపడ్డారు. ఆవును పట్టుకునేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ద్విచక్రవాహనం చోరీ

నిజామాబాద్ నేరవిభాగం, న్యూస్‌టుడే: నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స కోసం వచ్చిన రోగి ద్విచక్రవాహనం చోరీకి గురైంది. పోలీసుల వివరాల ప్రకారం.. నగరంలోని కోటగల్లీకి చెందిన శ్రీనివాస్ అనారోగ్యంతో ఆసుపత్రికి వచ్చారు. చికిత్స చేయించుకుని బయటకు వచ్చి చూడగా తన ద్విచక్రవాహనం కనిపించకపోవడంతో ఒకటో టౌన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

నిషేధిత గుట్కా పట్టివేత

బోధన్ (గ్రామీణం, న్యూస్‌టుడే): సాలూర తనిఖీ కేంద్రం వద్ద రూ.10వేల విలువైన నిషేధిత గుట్కాను పోలీసులు పట్టుకున్నట్లు గ్రామీణ ఎస్సై మశ్చేందర్‌రెడ్డి తెలిపారు. గురువారం సాయంత్రం బోధన్ నుంచి మహారాష్ట్ర వైపునకు ద్విచక్రవాహనంపై వెళ్తున్న వ్యక్తి అక్రమంగా గుట్కా తరలిస్తున్నట్లు గుర్తించి కేసు నమోదు చేసిన తనిఖీ చేస్తున్న పోలీసులను చూసి వాహనం, ప్యాకెట్లు వదిలేసి పారిపోయాడు. అతను శావులా గ్రామానికి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించి, అతని కోసం అన్వేషిస్తున్నారు. మటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

మొరం టిప్పర్..

మోపాల్, న్యూస్‌టుడే: మండలంలోని వివిధ గ్రామాల నుంచి అనుమతులు లేకుండా మొరం తరలిస్తున్న టిప్పర్‌ను భూగర్భగనుల శాఖ అధికారులు బుధవారం రాత్రి పట్టుకున్నారు. రూ.2 వేల జరిమానా విధించినట్లు ఎస్‌హెచ్‌వో యాదగిరిగౌడ్ తెలిపారు. టిప్పర్ స్వాధీనం చేసుకొని గురువారం రాజాకు తరలించినట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

మద్యం..

రెంజల్, న్యూస్‌టుడే: మహారాష్ట్ర సరిహద్దులోని రెంజల్ మండలం కందకుర్తిలో మద్యం అమ్ముతున్న ఓ వ్యక్తిపై దాడి చేసి మద్యం పట్టుకున్నట్లు ఎస్సై ఈ.సాయన్న తెలిపారు. సుమారు రూ.9వేల విలువ చేసే మద్యం సీసాలు జప్తు చేసి బాధ్యుడు అశోక్‌పై కేసు నమోదు చేసినట్లు వివరించారు. మహారాష్ట్ర ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో సరిహద్దుల్లో గట్టి నిఘా ఏర్పాటు చేశామని చెప్పారు.

ఆర్మూర్

● ఆర్మూర్ ● బాల్కొండ

కేటీఆర్‌కు సన్మానం



ఆర్మూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌ను గురువారం పట్టణ పార్టీ అధ్యక్షుడు పూజ నరేందర్, మాజీ వైస్ ఎంపీపీ గంగాధర్, యువజన నాయకుడు శ్రావణ్ సన్మానించారు. హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్ వెళ్తున్న ఆయనను పెర్కిట్‌లో జాతీయ రహదారిపై నాయకులు కలిశారు. రైతు సమస్యల గురించి ఆయనతో చర్చించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన



విద్యార్థినులతో లయన్స్ క్లబ్ ప్రతినిధులు

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: ఆర్మూర్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో గురువారం లయన్స్ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ నవనాథపురం ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. బ్రెస్ట్, సర్వైకల్ క్యాన్సర్‌ని అరికట్టేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు పృథ్వీరాజ్, సభ్యులు తిరుపతి, శ్రీధర్, శశిధర్‌రెడ్డి, ప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

సూచిక కనిపించక.. మార్గం తెలియక



ఆర్మూర్ నుంచి నిజామాబాద్ వెళ్లే జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనదారులు మూల మలుపులు, ఇతర గ్రామాలకు వెళ్లే కూడళ్ల వద్ద సూచికలు కనిపించక గందరగోళానికి గురవుతున్నారు. ఆలూరు బైపాస్ రోడ్డుకు ముందు నందిపేట్, ఆలూరు, ఇతర ప్రధాన గ్రామాలు, నిజామాబాద్ జిల్లా కేంద్రానికి దారి చూపుతూ ఉన్న సూచిక చెట్ల కొమ్మల మధ్య ఉండిపోయింది. దీంతో రాత్రి వేళల్లో దూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి ఇబ్బందులు తప్పడం లేదు. సంబంధిత అధికారులు సూచిక కనిపించేలా ఏర్పాటుచేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, ఆర్మూర్ పట్టణం

వరద తగ్గే.. గేట్లు మూసే

శ్రీరామసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ నుంచి వరద చేరిక తగ్గుముఖం పట్టింది. జలాశయం నుంచి మిగులు జలాల విడుదల కోసం ఎత్తిన వరద గేట్లన్నంటిని గురువారం మధ్యాహ్నం మూసివేశారు. ఉదయం 8 గేట్లు తెరిచి ఉండగా క్రమంగా అన్నీ మూసివేసినట్లు ప్రాజెక్టు ఏఈఈ కొత్త రవి తెలిపారు. ప్రాజెక్టులోకి ఎగువ నుంచి 14454 క్యూసెక్కుల వరద చేరుతుండగా.. పూర్తిస్థాయిలో 1091 అడుగుల నీటిమట్టం ఉంది. కాకతీయ కాల్వ ద్వారా 5800, ఎస్కేప్ ద్వారా 2200, వరద కాల్వకు 5000, లక్ష్మికి 150, సరస్వతికి 500, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు వదులుతున్నట్లు చెప్పారు. – న్యూస్‌టుడే, శ్రీరామసాగర్



విద్యార్థులూ బదిలీ అయ్యారు..!



వల్లభాపూర్ పాఠశాలలో మిగిలిన చిన్నారులు

ఏళ్లపాటు విధులు నిర్వర్తించిన ఉపాధ్యాయులు బదిలీకావడంతో ఆ బడికి కళ తప్పింది. పిల్లలతో సందడిగా ఉండాల్సిన ప్రాంతం వెలవెలబోతోంది. మాక్లూర్ మండలం వల్లభాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో గతంలో 70 మందికి పైగా విద్యార్థులుండేవారు. ఇటీవల కొందరు టీచర్లు బదిలీ కావడంతో పిల్లలూ ఇతర బడులకు వెళ్లిపోయారు. ప్రస్తుతం 22 మందే హాజరవుతున్నారు. ఒకటి, నాలుగో తరగతుల్లో ఒక్కొక్కరు, ఐదో తరగతిలో ఇద్దరు, మిగితా నాలుగింటిలో కలిపి 18 మంది ఉన్నారు. న్యూస్‌టుడే, మాక్లూర్

పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్) — ఈనాడు సినిమాలు

స్క్రీన్ 1 **నరుడి బ్రతుకు నటన:** 12.45, 6.50 **పొట్టేల్ :** 3.40, 9.45

స్క్రీన్ 2 **వెనమ్ ది లాస్ట్ డ్యాన్స్:** 11.15, 1.50, 4.25, 7.00, 9.35

స్క్రీన్ 3 **జనక అయితే గనక:** 1.00 **లగ్గం:** 4.00, 10.20, **వేట్టయాన్ :** 6.50

స్క్రీన్ 4 **దేవర :** 11.35, 6.25 **విశ్వం:** 3.10, **అయితే గనక:** 10.00

న్యూస్‌టుడే, ఆర్మూర్ పట్టణం

వైద్య పరీక్షలు


ఆర్మూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: గోవింద్‌పేట్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో పట్టణంలోని మామిడిపల్లి తపస్వి సేవా సంస్థ పాఠశాల విద్యార్థులకు గురువారం వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ ప్రీతి పావని చిన్నారులను పరీక్షించి అవసరమైన వారికి మందులు అందజేశారు. సరైన పోషకాహారం తీసుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్యకార్యకర్తలు మోహన్, జగ్జీవన్, స్టాఫ్‌నర్సు స్రవంతి, పాఠశాల డైరెక్టర్ శ్రీనివాస్, ప్రిన్సిపల్ శారద, కార్యదర్శి దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇరుకు గదుల్లో.. ఇబ్బందికర పాలన

☛ సంఘాల భవనాల్లో పంచాయతీ కార్యాలయాలు

– న్యూస్‌టుడే, నందిపేట్

పాలన పరమైన ఇబ్బందులు తొలగాలంటే చిన్న పల్లెలు, తండాలను పంచాయతీలుగా ఏర్పాటు చేయాలని ప్రజలు విన్నవించడంతో గత ప్రభుత్వం స్పందించింది. పంచాయతీలుగా ఏర్పాటుచేస్తున్నట్లు ప్రకటించింది. ఆయా పల్లెల ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. కానీ అవసరమైన సౌకర్యాలు కల్పించడంలో జాప్యం జరుగుతోంది. పంచాయతీ కార్యాలయాలు సొంత భవనాల్లో లేకపోవడం, కనీస వసతులు కొరవడడంతో విధులు నిర్వర్తించే ఉద్యోగులు, పనులతో వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా స్పందించి సౌకర్యాలను కల్పించాలని కోరుతున్నారు.



మాయాపూర్‌లో పంచాయతీకి వినియోగించుకుంటున్న వీడీసీ భవనం

జోర్‌పూర్‌లో సంఘ భవనం

ఎక్కడెక్కడంటే..

నందిపేట్ మండలంలోని కౌల్‌పూర్, జోర్‌పూర్, మల్లారం, మాయాపూర్, చిన్నయానం, మాక్లూర్ మండలంలో వల్లభాపూర్, వేణుకిసాన్‌నగర్, గుత్ప తండా, అమ్రాద్ తండా, సట్లపూర్ తండా, మెట్‌పల్లి, దుర్గానగర్ తండా, సింగంపల్లి తండాలు పంచాయతీలుగా ఏర్పడ్డాయి. వీటిలో ఏ పంచాయతీకి సొంత భవనం లేదు. ప్రస్తుతం గ్రామంలో అందుబాటులో ఉన్న భవనాల్లో నిర్వహణ కొనసాగుతోంది. ఈ ప్రక్రియ పూర్తయి ఆరేళ్లు గడుస్తున్నా నిర్మాణ ప్రక్రియలో ఎలాంటి పురోగతి లేదు. దీంతో సామాజిక సంఘ, వీడీసీకి చెందిన భవనాల్లోనే పంచాయతీలను నిర్వహిస్తున్నారు. ఇవి ఇరుకుగా ఉండడంతో ఉద్యోగులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మూత్రశాలలు, ఇతర వసతులు లేవు. సర్పంచి, కార్యదర్శి, సమావేశపు హాలు, సామగ్రి భద్రపర్చడానికి ఇలా వేర్వేరు గదులు ఉంటే పాలన సౌకర్యవంతంగా ఉంటుంది.

ప్రక్రియ వేగవంతం చేస్తాం

– లక్ష్మీప్రసాద్, ఎంపీవో, నందిపేట్

నూతనంగా ఏర్పాటైన గ్రామ పంచాయతీల భవనాలకు ఉపాధి హామీ పథకంలో నిధులు మంజూరయ్యాయి. వీటిని ఎక్కడ నిర్మించాలో స్థలాలు గుర్తిస్తున్నాం. పంచాయతీ తీర్మానాలు చేసి నిర్మాణ పనులు ప్రారంభిస్తాం. ప్రక్రియను వేగవంతం చేసేలా చర్యలు తీసుకుంటాం.

సమస్యలు పరిష్కరించాలి



– అర్జున్, మల్లారం, మాజీ సర్పంచి

ప్రభుత్వం మా విన్నపాన్ని ఆలకించి మా గ్రామాన్ని పంచాయతీగా ప్రకటించింది. పాలన చేరువైంది. కానీ సొంత పంచాయతీ భవనం కేటాయించకపోవడంతో వీడీసీ భవనంలో కొనసాగిస్తున్నాం. ఇబ్బందులు పడుతున్నాం. ఈ విషయాన్ని పాలకుల దృష్టికి తీసుకెళ్లాం. స్పందించి సమస్యలు పరిష్కరించాలి.

ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి



మేము సంఘ భవనంలో గ్రామ పంచాయతీని నిర్వహించుకుంటున్నాం. గదులు సరిపోవడం లేదు. సంఘ సమావేశాలు జరుపుకోవడానికి ప్రత్యామ్నాయం లేక సమస్యలు ఎదురవుతున్నాయి. ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి. **- రాము, జోర్‌పూర్**

మేమున్నాం.. మీకు తోడుగా..

94939 26837
98666 11160

పైపులైన్‌కు మరమ్మతులు

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: ఆర్మూర్ పట్టణంలోని తిరుమల కాలనీలో మిషన్ భగీరథ పైపులైను లీకై, రోడ్డు బురదమయంగా మారుతోందని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తీసుకొచ్చారు. సమస్యను పుర కమిషనర్ రాజుకు చేరవేయడంతో సిబ్బందిని అక్కడకు పంపించి మరమ్మతులు చేయించారు.

సమస్య : భీమ్‌గల్ మండలం పురాణీపేట్ గ్రామం పోచమ్మ గుడి దగ్గర రోడ్డుకి ఒకవైపు నాలా లేక మురుగు రోడ్డుపైకి వస్తోంది. ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. **- శంకర్**

సమాధానం: సమస్య మా దృష్టికి వచ్చింది. ప్రస్తుతం కచ్చా నాలా తీయించి.. బ్లీచింగ్ చేయిస్తాం. **- జితేందర్, పంచాయతీ కార్యదర్శి**

న్యూస్‌టుడే, భీమ్‌గల్ గ్రామీణం

పశువులకు టీకాలు

నందిపేట్, న్యూస్‌టుడే: రైతులు పశువుల ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయొద్దని మండల పశువైద్యాధికారి ప్రవీణ్ అన్నారు. మండలంలోని సిర్పూర్‌లో గురువారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. జీవాలు వ్యాధి బారిన పడకుండా ఉండడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది ధర్మోజీ, రైతులు పాల్గొన్నారు.

అపరిష్కృత పనులు పూర్తిచేయాలి

భీమ్‌గల్ గ్రామీణం, న్యూస్‌టుడే: అపరిష్కృతంగా ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని జడ్పీ సీఈవో ఉష అన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులను నిబంధనల ప్రకారం ఖర్చు చేయాలని పేర్కొన్నారు. భీమ్‌గల్ మండల పరిషత్ కార్యాలయాన్ని గురువారం ఆమె సందర్శించారు. అనంతరం బాబాపూర్ పల్లె ప్రకృతి వనం, నర్సరీని పరిశీలించారు. లింబాద్రిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సంతోష్‌కుమార్, జిల్లా పరిషత్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రావు, సీనియర్ అసిస్టెంట్ నవీన్, ఎంపీవో జావిద్, సూపరింటెండెంట్ భీమయ్య, ఏపీవో నర్సయ్య పాల్గొన్నారు.



వివరాలు తెలుసుకుంటున్న జడ్పీ సీఈవో ఉష

కళా సమితి ఏర్పాటు

కమ్మర్‌పల్లి, న్యూస్‌టుడే: కమ్మర్‌పల్లిలో తెలుగు భాషా కవులు, పండితులతో కలిసి నూతనంగా శ్రీసుధా సాహితీ కళా సమితిని ఏర్పాటు చేసినట్లు విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు, సమితి అధ్యక్షుడు గంగాధర్ తెలిపారు. ఉపాధ్యక్షుడిగా వేములవాడ జనార్దనచారి, కార్యదర్శి నాగభూషణం, కార్యవర్గ సభ్యులుగా లక్ష్మీనర్సయ్య, మధుసూదన్, రాజేశ్వర్, బంతిలాల్, స్వరూపరాణి, సబిత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని పేర్కొన్నారు. సభ్యులుగా వి.రాజయ్య, ఆనంద్, బీజీరాం, ప్రసాద్, రవి, రాజేశ్వర్, గంగాధర్, బుచ్చయ్య, సలహాదారులుగా హన్మంతు, అమర్‌నాథచారి, నర్సయ్య, సైదు నర్సయ్యలను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.



ఎన్నికైన నూతన కార్యవర్గం

ఎన్నికల హామీలు నెరవేర్చాలి

కమ్మర్‌పల్లి, న్యూస్‌టుడే: ఎన్నికల్లో కాంగ్రెస్ రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సురేష్ డిమాండ్ చేశారు. కమ్మర్‌పల్లిలో జరిగిన పార్టీ మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని, రైతు భరోసా ఎకరానికి రూ.7500 చెల్లించాలని, వడ్లకు రూ.500 బోనస్ ఇవ్వాలని కోరారు. వరంగల్ డిక్లరేషన్‌ను అమలు చేయాలన్నారు. బాలయ్య, అశోక్ కిషన్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు సురేష్

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



ఏర్గట్ల: మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పీఏసీఎస్) ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కమ్మర్‌పల్లి వ్యవసాయ మార్కెట్ అధ్యక్షుడు పాలెపు నర్సయ్య గురువారం ప్రారంభించారు. రైతులు ధాన్యాన్ని కేంద్రానికి తీసుకువచ్చి మద్దతు ధర పొందాలన్నారు. ఏఎంసీ ఉపాధ్యక్షుడు బుచ్చయ్య, సొసైటీ అధ్యక్షుడు చిన్న నర్సయ్య, సీఈవో శ్రీనివాస్, డైరెక్టర్ లింగారెడ్డి, తాళ్లరాంపూర్ సొసైటీ అధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పర్యటన నేడు

ఏర్గట్ల, న్యూస్‌టుడే: మండల కేంద్రంతో పాటు తాళ్లరాంపూర్, దోంచంద గ్రామాల్లో ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి శుక్రవారం పర్యటించనున్నట్లు భారాస నాయకులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలో రూ.15 లక్షలతో నిర్మించిన షాదీఖానా, తాళ్లరాంపూర్, దోంచంద గ్రామాల్లో రూ.20 లక్షలతో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ భవనాల ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

అవీ...ఇవీ.. అన్నీ

పెర్కిట్‌లో రక్తదాన శిబిరం

బాల్కొండ: పోలీసుల అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఆర్మూర్ మండలం పెర్కిట్‌లో రక్తదాన శిబిరాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఎస్సై నరేశ్ తెలిపారు. శిబిరం ఉదయం 9 గంటలకు పెర్కిట్‌లోని ఎంఆర్ గార్డెన్‌లో శిబిరం ప్రారంభమవుతుందన్నారు. బాల్కొండ మండలం నుంచి శిబిరంలో పాల్గొనే వారు ఉదయం 8.30 లోపు స్థానిక పోలీస్ స్టేషన్‌కు వస్తే బస్సులో తీసుకెళ్తామన్నారు.

రిజర్వేషన్లపై సలహాలు, అభ్యంతరాలకు అవకాశం

బాల్కొండ, న్యూస్‌టుడే: రాష్ట్రంలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కల్పించాల్సిన రిజర్వేషన్లపై సలహాలు, అభ్యంతరాలను బీసీ కమిషన్‌కు తెలపడానికి అవకాశం ఉందని ఎంపీడీవో విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీవో గంగామోహన్ తెలిపారు. ఈ నెల 29న కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 వరకు కమిషన్ ఛైర్మన్, సభ్యులు సలహాలు, అభ్యంతరాలు స్వీకరిస్తారని పేర్కొన్నారు. నవంబరు 13వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు కమిషన్ ఛైర్మన్, కార్యదర్శి పేరుపై రిజిస్టర్ పోస్టులో సైతం సమర్పించుకోవచ్చన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

నందిపేట్: విద్యార్థులు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి ప్రవీణ్ అన్నారు. నందిపేట్‌లోని పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు పరీక్షలు చేసి అవసరమైన ఔషధాలు పంపిణీ చేశారు. ప్రిన్సిపల్ రాజ్‌కుమార్, వైద్య సిబ్బంది దేవన్న, భాస్కర్, వనజ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

తొర్తి(ఏర్గట్ల), న్యూస్‌టుడే: మండలంలోని తొర్తి గ్రామానికి చెందిన గంగాధర్ ఇటీవల రోడ్డుప్రమాదంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి సునీల్‌రెడ్డి బాధిత కుటుంబీకులకు రూ.5 వేల ఆర్థికసాయాన్ని పార్టీ నాయకుల ద్వారా గురువారం అందజేశారు.

తాగునీటి సమస్య తీర్చాలని వినతి

ముప్కాల్(బాల్కొండ): ముప్కాల్ ఇందిరమ్మ కాలనీలో మిషన్ భగీరథ నీరు సరిపడా రావడం లేదని మహిళలు గురువారం పంచాయతీ కార్యాలయానికి వచ్చి సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. మూడు రోజులుగా అరకొరగా నీరొస్తుందని వాపోయారు.

పోషకాహారంపై శిక్షణ

మోర్తాడ్: మోర్తాడ్‌లో అంగన్‌వాడీ టీచర్లు, ఆశాలకు, ఏఎన్ఎంలకు శిక్షణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. పోషకాహార లోపంతో బాధపడుతున్న పిల్లలకు చికిత్సపై ఏసీడీపీవో జ్ఞానేశ్వరి వివరించారు. బాలింతలు, గర్భిణులు తీసుకోవాల్సిన ఆహారం గురించి తెలిపారు.



మాట్లాడుతున్న ఏసీడీపీవో జ్ఞానేశ్వరి

ఏడాది జైలు శిక్ష

బాల్కొండ, న్యూస్‌టుడే: మండలకేంద్రంతో పాటు శ్రీరాంపూర్‌లోని మందిరాల్లో చిట్టాపూర్‌కు చెందిన గండికోట గంగాధర్, పాటుకుట్‌వార్ సందీప్ చోరీకి పాల్పడగా వారికి ఏడాది జైలు శిక్షతో పాటు, రూ.వేయి చొప్పున జరిమానా విధిస్తూ ఆర్మూర్ కోర్టు ప్రథమశ్రేణి న్యాయమూర్తి వేముల దీప్తి గురువారం తీర్పు ఇచ్చారని ఎస్సై నరేశ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గతేడాది నవంబరు 22న రాత్రి బాల్కొండ శివారులోని లింగమయ్య ఆలయం, శ్రీరాంపూర్‌లోని చిలుకల చిన్నమ్మ మందిరంలో హుండీలు ధ్వంసం చేసి డబ్బులు, వెండి వస్తువులు ఎత్తుకెళ్లారు. అప్పుడు బాల్కొండ ఎస్సైగా ఉన్న గోపి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అనంతరం ఛార్జిషీటు దాఖలు చేశారు. కోర్టులో ఏపీపీ రామకృష్ణ 12 మంది సాక్షులను విచారించి నేరం రుజువు చేశారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

బాల్కొండ, న్యూస్‌టుడే: బాల్కొండ వన్నెల్(బి) కూడలి, శివాజీ చౌక్ వద్ద గుర్తు తెలియని మృతదేహం గురువారం లభించిందని ఎస్సై నరేశ్ తెలిపారు. భిక్షాటన చేసుకుంటూ జీవిస్తున్నట్లు తెలిసిందన్నారు. మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే వివరాలకు పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ


భీమ్‌గల్ గ్రామీణం, న్యూస్‌టుడే: తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన ఘటన బడాభీమ్‌గల్‌లో బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన లక్ష్మి ఒంటరిగా జీవిస్తున్నారు. ఇంటికి తాళం వేసి పక్కింట్లో ఉండే తమ అత్త నివాసంలో నిద్రించారు. చోరులు అర్ధరాత్రి సమయంలో ఇంటికి వేసిన తాళాన్ని పగలగొట్టి మూడున్నర తులాల బంగారు ఆభరణాలు, కొంత నగదు చోరీ చేశారు. బాధితురాలు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేష్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

బాల్కొండ: బాల్కొండ శివారులో 44వ నంబరు జాతీయ రహదారిపై గురువారం ద్విచక్రవాహనం అదుపు తప్పి విభాగినిని ఢీ కొంది. ప్రమాదంలో ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి. మహారాష్ట్రలోని సాసర్‌కుండ్‌కు చెందిన యువరాజ్, చరణ్ ఆర్మూర్ నుంచి ద్విచక్రవాహనంపై నిర్మల్ వైపు వెళ్తుండగా ఘటన చోటుచేసుకుంది. పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి బాధితుల వివరాలు సేకరించారు. గాయపడిన వారిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు.

ఆలోచింపజేసేలా..!

వేల్పూర్, న్యూస్‌టుడే : వేల్పూర్ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం అంబేడ్కర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అంబేడ్కర్ జీవిత చరిత్ర నాటిక ప్రదర్శన ఆకట్టుకోవడంతో పాటు ఆలోచింపజేసింది. అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ హైదరాబాద్ ఆధ్వర్యంలో సంఘం శరణం గచ్ఛామి నాటిక ప్రదర్శన నిర్వహించారు. అంబేడ్కర్ జీవితం నుంచి స్ఫూర్తి పొందాలని ప్రతినిధులు పేర్కొన్నారు. వివిధ గ్రామాల ప్రజలు తరలివచ్చారు.



అంబేడ్కర్ జీవిత చరిత్ర నాటిక ప్రదర్శిస్తున్న ప్రతినిధులు

సిద్దిపేట సందర్శించిన పుర అధికారులు



చెత్త శుద్ధి పద్ధతులు వివరిస్తున్న స్థానిక ప్రతినిధులు

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: సిద్దిపేట పురపాలికలో ఇంటింటి చెత్త సేకరణ కార్యక్రమం విజయవంతం కావడంతో గురువారం ఆర్మూర్ పుర కమిషనర్ రాజు, ఇతర అధికారులు క్షేత్రస్థాయిలో వెళ్లి పరిశీలించారు. ప్రతి మంగళ, శుక్రవారాల్లో పొడి చెత్త, ప్రతి రోజు తడి చెత్తను వేరు చేస్తున్న విధానం తెలుసుకున్నారు. పలు వార్డుల్లో పర్యటించి, అక్కడి స్థానికులతో మాట్లాడారు. బయో గ్యాస్ ప్లాంట్, బయో మైనింగ్, తడి పొడి చెత్త సేకరణ కేంద్రం, స్వచ్ఛ బడిని అధికారులు సందర్శించారు. స్వచ్ఛ ఆర్మూర్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామన్నారు. కమిషనర్ రాజు వెంట డీఈఈ భూమేశ్వర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్, పర్యావరణ ఇంజినీర్ పూర్ణమౌళి, సిబ్బంది ఉన్నారు.

భీమ్‌గల్ గ్రామీణం, న్యూస్‌టుడే: సిద్దిపేట పురపాలికను భీమ్‌గల్ మున్సిపల్ అధికారులు సందర్శించారు. చెత్తతో బయో గ్యాస్ తయారీ విధానం, పరికరాల వినియోగం గురించి వివరించినట్లు జూనియర్ అసిస్టెంట్ నవీన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఓంకార్ తెలిపారు.



భీమ్‌గల్ గ్రామీణం: వర్మీ కంపోస్టు గురించి తెలుసుకుంటూ..

గుంత.. ప్రయాణికుల చింత



భీమ్‌గల్ మండలంలోని పురాణీపేట్ నుంచి లింబాద్రిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయం, పల్లికొండకు వెళ్లే ప్రధాన రహదారి మధ్యలో గుంత పడింది. అదే ప్రాంతంలో మూలమలుపు ఉండడంతో రాత్రి వేళల్లో ప్రమాదాలకు గురవుతున్నామని వాహనచోదకులు వాపోతున్నారు. ఎవరూ ప్రమాదాల బారిన పడకుండా అందులో కొందరు కర్రలు సూచికల్లా ఉంచారు. నిత్యం వందలాది వాహనాలు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటాయి. అధికారులు స్పందించి గుంతను పూడ్చాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, భీమ్‌గల్ గ్రామీణం